జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP సంపుటి : 1 సంచిక: 123 శుక్రవారం 26 సెప్టెంబరు – 2025 పేజీలు : 8 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## సర్కార్ చేతికి మెట్రో



ఇక మొదటి దశ నిర్వహణ ప్రభుత్వానిదే..

13 వేల కోట్ల రుణం చెల్లింపునకు అంగీకారం.. కంపెనీ వాటా కింద ఎల్ అండ్ టీకి 2 వేల కోట్లు కంపెనీ ప్రతినిధులతో చర్చలు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కుదిరిన ఒప్పందం

రెండో దశ మెట్రోకు మార్గం సుగమం.. హైదరాబాద్ నగర చరిత్రలో మరో అధ్యాయం ఎల్ అండ్ టీతో భాగస్వామ్య ఒప్పందం కుదిరితేనే రెండో దశకు అనుమతిస్తామని కేంద్రం షరతు

ప్రతిష్ఠంభన తొలగించేందుకు చొరవ చూపిన సీఎం.. చర్చలకు వచ్చిన ఎల్ అండ్ టీ సీఎండీ రెండో దశలోనూ భాగస్వామి కావాలన్న సీఎం.. రవాణా వ్యాపారం వదులుకున్నామన్న సీఎండీ

కావాలంటే మొదటి దశ ఇచ్చేస్తామని ఆఫర్.. స్వీకరించేందుకు సరేనన్న రాష్ట్ర ప్రభుత్వం మెట్రో చేతిలో 260 ఎకరాలు.. ప్రభుత్వమే అమ్ముకోవచ్చు.. అప్పు భారం కాదని అధికార్ల అంచనా

హైదరాబాద్, సెప్టెంబరు 25(సందేశం టైమ్స్) : హైదరాబాద్ నగర భవిష్యత్తుకు సంబంధించి కీలకమైన ముందడుగు పడింది. మెట్రో రైలు సేవలను నగరమంతా విస్తరించేందుకు అవసరమైన రెండో దశ, మూడో దశ మెట్రోల నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి. రెండు, మూడు దశల్లో ఏ రకంగానూ భాగస్వామ్యం పంచుకోవడానికి సిద్ధంగా లేని ఎల్ అండ్ టీ సంస్థను సాగనంపి, తొలిదశ మెట్రోను స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో దేశంలోనే తొలి ప్రైవేటు మెట్రో.. ప్రభుత్వపరం అవుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎల్ అండ్ టీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. మెట్రో మొదటి దశ కింద ఉన్న రూ.13 వేల కోట్ల అప్పులను ప్రభుత్వం తీసుకోవడానికి అంగీకరించారు. హైదరాబాద్ మెట్రో రైల్ స్పెషల్ పర్పస్ వెహికిల్‌లో ఎల్ అండ్ టీ భాగమైన రూ.5,900 కోట్ల మొత్తంలో రూ.2000 కోట్లు వన్ టైం సెటిల్‌మెంట్ కింద చెల్లించేందుకు సమ్మతి తెలిపారు.

ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే మెట్రో తొలిదశ నిర్వహణ ప్రభుత్వం చేతికి వస్తుంది. రెండోదశ పనులకు మార్గం సుగమం అవుతుంది. ఒకప్పుడు దేశవ్యాప్తంగా మెట్రో రైలు నెట్‌వర్క్ పొడవులో రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ నేడు తొమ్మిదో స్థానానికి దిగజారింది. నగర విస్తరణ, పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం రెండోదశ కింద 2ఏ, 2బి పేరుతో 8 మార్గాలతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది.

## కాళేశ్వరంపై రంగంలోకి సీబీఐ

ఎన్‌డీఎస్‌ఏ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఘోష్ కమిషన్ దర్యాప్తు నివేదికలివ్వండి సీఎస్‌కు సీబీఐ అధికారుల లేఖ నివేదికలు పరిశీలించాకే న్యాయ సలహా మేరకు ప్రాథమిక దర్యాప్తు ఐఏఎస్‌ల పాత్ర ఉన్నందున కేంద్రం అనుమతి తప్పనిసరి కేసీఆర్, హరీశ్‌ల కోసం గవర్నర్ అనుమతి అన్నీ వచ్చాకే పూర్తి స్థాయి దర్యాప్తు

హైదరాబాద్, సెప్టెంబరు 25 (సందేశం టైమ్స్) : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి విజ్ఞప్తిని అందుకున్న సీబీఐ ఈ అంశంపై ప్రాథమిక ఆధారాలు సేకరించడం ప్రారంభించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై సీబీఐ విచారణ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల మొదటి వారంలో సీబీఐకి లేఖ రాసింది. తెలంగాణకు సంబంధించి సీబీఐ కేసుల నమోదుకు అనుమతి నిరాకరిస్తూగతంలో కేసీఆర్ ప్రభుత్వం జీవో నంబర్ 51 ఇచ్చింది. ఒక్క కాళేశ్వరం కేసుకు మినహాయింపునిస్తూ ఇటీవల రేవంత్‌రెడ్డి సర్కారు జీవో 104ను విడుదల చేసింది. పీసీ ఘోష్ నివేదికపై అసెంబ్లీలో చర్చించిన తర్వాత సీబీఐ విచారణకు అప్పగిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం నుంచి లేఖ అందినప్పటికీదర్యాప్తు విషయంలో సీబీఐ అధికారికంగా ఎలాంటి జవాబు ఇవ్వలేదు. అయితే, సీబీఐ అధికారులు గురువారం ఈ కేసుకు సంబంధించిన సమాచారం కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు లేఖ రాసినట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలకు సంబంధించి జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ ఎన్‌డీఎస్‌ఏ , విజిలెన్స్ కమిషన్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్, జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికలను తమకు పంపించాలని లేఖలో కోరినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులతో సీఎస్ సమావేశం నిర్వహించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఎన్‌డీఎస్‌ఏ బృందం 2023లో సంఘటన స్థలాన్ని సందర్శించింది.

## రైతును సన్మానించిన రాష్ట్ర మంత్రులు




ఎలిగేడు, సెప్టెంబరు 25 (సందేశం టైమ్స్) : మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన రైతు, ఉత్తమ గ్రామ పంచాయతీ మాజీసర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావుకు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్‌లో గురువారం సీడ్స్‌మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, నీటి పారుదలశాఖ మంత్రి ఉ త్తమకుమార్‌రెడ్డి ఆయనను సన్మానిం చారు. సుల్తాన్‌పూర్‌లో ఆయన పలు కంపెనీలకు చెందిన హైబ్రిడ్, నాణ్యమైన వరివిత్త నాలను ఉ త్పత్తిచేయడంపై దృష్టిసారించారు. చుట్టు పక్కల ఉన్న గ్రామాల రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి అధిక దిగుబడులకు కృషి చేశారు. వెంకటేశ్వర్‌రావును విత్తన ఉత్పత్తిదారుడిగా గుర్తించి ఉ త్తమ రైతుగా ఎంపికచేశారు. ఈ సందర్భంగా మంత్రులు ఆయనకు శాలువాకప్పి మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో శీర్షిక అసోసియేషన్ అధ్యక్షుడు జీఎన్‌వీరామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రఘు, వాసు, సభ్యులు తానిపర్తి రవీందర్ రావు, వెల్ది తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

## ఇక మద్యం దుకాణాల జాతర



కరీంనగర్ , సెప్టెంబరు 25 (సందేశం టైమ్స్) : మద్యం షాపుల లైసెన్స్‌లు నవంబరు 30వ తేదీ వరకు గడువు ఉంది. అక్టోబరులో స్థానిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ రానుండడంతో రెండు నెలల ముందుగానే మద్యం షాపుల వేలం ప్రక్రియను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మద్యం పాలసీని ప్రకటిస్తూ జీవో జారీ చేసింది. గతంలో ఉన్న దరఖాస్తు ఫీజును (నాన్ రిఫండబుల్) రెండు లక్షల నుంచి మూడు లక్షలకు పెంచింది. మిగతా విషయాల్లో పాత పాలసీనే అనుసరించింది. జనాభా ప్రాతిపదికన లైసెన్సు ఫీజును వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 2025 డిసెంబరు 1 నుంచి 2027 నవంబరు 30వ తేదీ వరకు నూతన మద్యం విధానం అమల్లోకి వస్తుంది.

గతంలో మాదిరిగానే లాటరీ ద్వారా వైన్‌షాపుల లైసెన్స్‌దారులను ఎంపికచేయనున్నారు. మద్యం షాపు లైసెన్స్ కోసం ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఎక్సైజ్ టాక్స్‌ను గతంలో మాదిరిగా ఆరు విడతల్లో చెల్లించేందుకు వీలు కల్పించారు. కొత్త పాలసీ ప్రకారం మద్యం రిటైల్ షాపులన్నీ విధిగా మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ కెమెరాలను ఎక్సైజ్ కంట్రోల్‌రూంకు అనుసంధానం చేస్తారని పాలసీలో పేర్కొన్నారు. వైన్స్ వద్ద విధిగా పార్కింగ్ స్థలాలను కూడా లైసెన్సుదారులే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.

## తెలంగాణలో మరో కొత్త పథకం.. ఎప్పటి నుంచి అంటే....

చెన్నై:(సందేశం టైమ్స్) : అన్నాదొరై, కరుణానిధి, కామరాజ్ వంటి గొప్ప యోధుల జన్మస్థలం తమిళనాడు అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కరుణానిధి విజన్‌ను అమలు చేస్తున్న సీఎం స్టాలిన్, డిప్యూటీ సీఎం ఉదయనిధిలను అభినందిస్తున్నట్లు చెప్పారు. చెన్నై జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన విద్యలో ముందంజ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంత మంచి కార్యక్రమానికి తనని ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరాగాంధీ కామరాజ్ ప్లాన్‌ను తీసుకువచ్చారని గుర్తు చేశారు. కామరాజ్ తమిళనాడులో తీసుకువచ్చిన విద్యా విధానాన్ని దేశం అనుసరిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. విద్యలో ముందంజ కార్యక్రమం తమిళనాడు యువతకు ఎంతో స్ఫూర్తి దాయకంగా ఉంటుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. తమిళనాడు అవలంబిస్తున్న సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం హృదయాన్ని తాకుతుందని వ్యాఖ్యానించారు. తెలంగాణలోను ఈ స్కీమ్‌ను వచ్చే ఏడాది నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. నాన్ ముదలవన్ (స్కిల్ డవెలప్‌మెంట్) కింద రూ.10 వేల ఉపకార వేతనం ప్రభుత్వ కళాశాలలకు వెళ్లే బాలురు, బాలికలకు ఇచ్చే స్కీమ్‌లు ఉండడం అదృష్టమని చెప్పుకొచ్చారు. తమిళనాడు పేదలకు అండగా మంచి సీఎం స్టాలిన్ ఉన్నారని చెప్పారు. ఎన్నో శతాబ్దాల నుంచి తమిళ, తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య సాంస్కృతిక, చారిత్రకపరమైన బలమైన సంబంధం ఉందని వివరించారు. 1991 సరళీకరణ తర్వాత సరళీకృత ఆర్థిక విధానాలతో తమిళనాడులో



మ్యాన్యుఫ్యాక్చరింగ్ రంగం అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. అలాగే తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగాలు అభివృద్ధి చెందాయని సీఎం రేవంత్ వెల్లడించారు.

## సచివాలయంలో ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడిన కొండా సురేఖ, సీతక్క

సెప్టెంబరు 25(సందేశం టైమ్స్) : 'ఒక్కేసి పువ్వేసి చందమామ' అంటూ మహిళా ఉద్యోగులతో బతుకమ్మ ఆడిన మంత్రులు బతుకమ్మలను పేర్చి ఇళ్ల నుంచి తీసుకువచ్చిన ఉద్యోగినులు గడ్డం సంతోష్ రూపొందించిన బతుకమ్మ పాటను ఆవిష్కరించిన మంత్రులు తెలంగాణ రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క సచివాలయంలో మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు. 'ఒక్కేసి పువ్వేసి చందమామ' అంటూ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురు మహిళా ఉద్యోగులు తమ



ఇళ్ల నుంచి బతుకమ్మలను అందంగా పేర్చి సచివాలయానికి తీసుకువచ్చారు. మంత్రులు కొండా సురేఖ, సీతక్క పక్కపక్కనే నిలబడి బతుకమ్మ ఆడి సందడి చేశారు.బతుకమ్మ పాట ఆవిష్కరణ ప్రముఖ గాయకుడు గడ్డం సంతోష్ రూపొందించిన బతుకమ్మ పాటను సచివాలయంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ ఆవిష్కరించారు.

## గురుకుల ఖాళీలపై హైకోర్టు కీలక తీర్పు



సెప్టెంబరు 25 (సందేశం టైమ్స్) : తెలంగాణ రాష్ట్రంలో గురుకుల నియామకాల భర్తీకి సంబంధించి పిటిషన్‌లను ఇటీవల విచారించింది. ఈ కేసు పట్ల కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది, ఇది పిటిషనర్ల భవిష్యత్తుకు శక్తివంతమైన ప్రకాశం కలిగించింది. హైకోర్టు తీర్పు ప్రకారం, గురుకుల నియామకాల ప్రక్రియలో మిగిలిన ఖాళీలను పిటిషనర్లతో భర్తీ చేయాలని స్పష్టంగా ఆదేశించింది. ఈ భర్తీ ప్రక్రియను వచ్చే ఆరు నెలల్లో పూర్తి చేయాలని కూడా కోర్టు సూచించింది.కోర్టు తీర్పు వల్ల పిటిషనర్లకు ఉద్యోగం లభించే అవకాశం దక్కింది. దీనిపై పిటిషనర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు సంవత్సరాల క్రితం అనగా 2023లో తెలంగాణ గురుకుల నియామక సంస్థ 9 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది.

## సారీ ఫంక్షన్ కు ముఖ్య అతిథిగా హాజరైన మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ చిలుముల సువాసిని రెడ్డి





సందేశం టైమ్స్:సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి

సెప్టెంబర్ 25 ఈరోజు మెదక్ జిల్లా శివంపేట్ మండల్ పిల్లుట్ల గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజు కూతురు ప్రత్యూష సారీ ఫంక్షన్ కు ముఖ్య అతిథిగా హాజరైన మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ చిలుముల సువాసిని రెడ్డి ప్రముఖ సంఘ సేవకులు బీసీ నాయకులు బండారి సంతోష %ఒ% గంగాధర్, నాయిని బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు స్వామి,కాంగ్రెస్ నాయకులు బండారి ముత్యాలు,బండారి యాదగిరి,బండారి శ్రీను, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండారి నాగేష్ ,పిల్లి నరేష్,పిల్లి అంజయ్య.గొల్లపల్లి పెద్ద నరసన్న. మంగలి శ్రీను,బండారి సాయి కిరణ్,బండారి శ్రీకాంత్,గాండ్ల దాసు మరియు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సింగూరు ప్రాజెక్టు వద్ద పర్యాటకుల వీరంగ కత్తులతో కర్రలతో దాడులు





సందేశం టైమ్స్ :సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి సెప్టెంబర్ 25 సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సింగూర్ గ్రామం బిడ్జి పైన వీరంగం సృష్టించిన ముస్లిం మైనార్టీలు అంత మా ఇష్టం అడ్డం వస్తే అడ్డంగా నరికేస్తాం అంటూ కత్తులతో దాడిదాడి చేసిన వారిని చట్టరీత్య కఠినంగా శిక్షణ్చలేనిచో పోలీస్ స్టేషన్ ముందు భారీ ఎత్తున నిరసన చేస్తాం -సిహెచ్ పి సుభాష్ చందర్ చంపడానికి ప్రయత్నిస్తే మామూలు కేసులు ఎలా పెడుతారు

ఒ కె వర్గానికే కొమ్ముకాస్తున్న పోలీసులుదెబ్బలుతిన్నవారిపైననే కేసులు నమోదు చేసిన పోలీసులుపుల్కల్ మండల పరిధిలోని సింగూర్ ప్రాజెక్టు ను చూడటానికి మంగళవారం నాడు హైదరాబాదు నుండి కుటుంబ సభ్యులతో సుమారు ఏడు కార్లలో లో సుమారు 35 మంది ప్రాజెక్టును చూడడానికి వచ్చిన పర్యాటకులు సింగూర్ బిడ్జి పైన ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తూ ఏంజయ్ పలు రకాల నృత్యాలు డ్యాన్సులు చేస్తు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది అంతలోనే ఎమ్ ఆర్ ఎఫ్ కంపెనీకి చెందిన బస్సులు వెళ్తున్న సమయంలో కంపెనీ బస్సులకు దారి ఇవ్వకుండా ఏంజయ్ చేస్తుంటే పక్కకు జరగండి మేము వెళ్తాము అని కంపెనీ కి చెందిన బస్సు డ్రైవర్ సాయిరాం అడుగగా డ్రైవర్ పైన దుర్భషలడుతూ దాడి చేశారు.అడ్డం వచ్చిన ఎమ్ ఆర్ ఎఫ్ ఉద్యోగి పైన దాడి చేయడంతో సింగూర్ వ్యక్తులకు తీవ్రంగా గాయపడ్డారు. ఆ విషయం తెలుసుకున్న సింగూర్ మిత్రులు ప్రజలు సంఘటన స్థలానికి వెళ్లి ఏందుకు కొట్టారు అని అడిగితే అడ్డం వస్తే అడ్డంగా నరికేస్తాం అంటూ కత్తులు తీసి మళ్ళీ దాడికి హత్య చేయడానికి ప్రయత్నించడం జరిగింది .విషయం తెలుసుకున్న పుల్కల్ పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు దాడి చేసుకుంటున్న ఇరువురిని నచ్చజెప్పి గొడవను ఆపేశారు ఈ గొడవలో సింగూరు గ్రామ యువకులకు పలువురికి తీవ్ర గాయాలయ్యాయి కొందరికి తలలు కూడా పగిలాయి దీంతో పుల్కల్ పోలీసులు రెండు వర్గాల వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేసారు. విషయం తెలుసుకున్న బజరంగ్దళ్ నాయకులు బుధవారం నాడు పుల్కల్ పోలీసులతో మాట్లాడుతూ ధర్మప్రసార్ స్టేట్ కొకన్వీనర్ సుభాష్ చందర్ మాట్లాడుతూ తీవ్ర గాయాలపాలైన సింగూరు గ్రామస్తులపై కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు .దాడిచేసి హత్యచేయటానికి ప్రయత్నం చేసిన వాళ్ళ పైన మామూలు కేసులు ఏలపెడుతారు పుల్కల్ పోలీసులు హిందువులపై నమోదు చేసిన కేసులను వెంటనే తొలగించాలన్నారు లేనియెడల సిహెచ్ పి బజరంగ్దళ్ ఆధ్వర్యంలో ముందు భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బజరంగ్దళ్ జిల్లా సంయోజక్ ప్రభు గౌడ్, సింగూర్ గ్రామ పెద్దలు శేఖర్, శ్రీనివాస్, పెంటా గౌడ్, ఇంద్రా గౌడ్ గార్లు సింగూర్ వెళ్ళి గాయపడ్డ కార్యకర్తలు మనోహర్ గౌడ్ మంగలి ధన్ రాజ్ మంగలి మహేష్ బెస్త భరత్ దాసరి సాయిరాం మలిగిరి మల్లేశం గార్లను పరామర్శించారు.

## బదిలీపై వెళుతున్న ఏపీఎం సంగీత ను సన్మానించిన



మండల సమాఖ్య సీసీలు,విఓఏలు సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 25సెప్టెంబర్ సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గంలో రేగోడ్ మండలం పరిధిలోని మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం మండల సమాఖ్య ఏపీఎం సాయిలు,సీసీలు, విఓఏలు,మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.అనంతరం సీసీలు,విఓఏలు,మండల సమాఖ్య అధ్యక్షురాలు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాజేష్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ భూమయ్య,మండల సమాఖ్య అకౌంటెంట్ బదిలీలపై వెళుతున్న మండల సమాఖ్య ఏపీఎం సంగీత ను శాలువాతో సన్మానించారు.అనంతరం ఏపీఎం సంగీత మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా ప్రతి సీసీలు మరియు విఓఏలు అందరం కలిసికట్టుగా పనిచేస్తూ ప్రతి విషయంలో సంహరించినందుకు ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు.

## సూర్యాపేటలో సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కెట్ త్వరలో వినియోగంలోకి



సూర్యాపేట, 25 సెప్టెంబర్ 2025 (సందేశం టైమ్స్) సమీకృత వెజ్ %ఒ% నాన్ వెజ్ మార్కెట్ను ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన సూర్యాపేట పట్టణంలోని సమీకృత మార్కెట్ను పరిశీలించారు.మార్కెట్లో గాలి, వెలుతురు రాకపోవడంతో వ్యాపారస్తులు వినియోగం చేయడంలేదని ఆయన గమనించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, గాలి మరియు వెలుతురు వచ్చేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, వ్యాపారులకు క్రయవిక్రయాలు సులభంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే వచ్చే శనివారం మార్కెటింగ్ అధికారులు, మున్సిపల్, ఇంజనీరింగ్ విభాగాల సమన్వయంతో సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ 31 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ సమీకృత మార్కెట్ రైతులు, ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని అన్నారు.ఈ పరిశీలన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, ఆర్డీఓ వేణు మాధవ్, మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి, మార్కెట్ కార్యదర్శి మహమ్మద్ ఫసియుద్దిన్, మార్కెటింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పలు గ్రామంలో స్వచ్ఛోత్సవ్ - పక్షోత్సవాలు కార్యక్రమం



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 25సెప్టెంబర్ సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో మానూర్ మండలం పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా కలెక్టర్%ఒ% చైర్మన్ స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ), సంబంధించిన అధికారులు ఆదేశాల మేరకు మానూర్ మండలం పరిధిలో [illegible] సిరికపల్లి,కమలపూర్,డవ్వూర్ గ్రామంలో మండల సమాఖ్య ఏపీఎం సీసీలు వీఓఏలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు ఆధ్వర్యంలో స్వచ్ఛోత్సవ్ - పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు.అనంతరం వివిధ గ్రామాల్లో ప్రజల సహకారం ద్వారా శ్రమ దానాలు, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ,వ్యర్థల తొలగింపు,స్వచ్ఛ శ్రామికుల సంక్షేమ కార్యక్రమాలు, పర్యావరణ హితమైన పండుగల నిర్వహణ నిర్వహిస్తు



శ్రమదానం చేద్దాం, నిత్యం స్వచ్ఛతని పాటిద్దాం...మన ఇళ్ళు -మన వాడ -మన ఊరు- మన ఆరోగ్యం కోసం... అనేది నినాదంతో ముందుకు కొనసాగారు.ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## గంజా సాగుపై దాడి - 155 మొక్కలు తొలగింపు




సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25శ్రీ శ్రీనివాస్ రెడ్డి , ఇన్చార్జ్ డిప్యూటీ కమిషనర్, మెదక్ జిల్లా మరియు శ్రీ నవీన్ చంద్ర గారు, జిల్లా నిషేధ మరియు ఎక్సైజ్ అధికారి గారి ఆదేశాల మేరకు, సంగారెడ్డి డీటిఎఫ్ (%ఋఖీ%) బృందం మానూర్ మండలంలోని బోర్నాచ మండల పరిధిలో తనిఖీలు చేపట్టింది. దర్యాప్తులో భాగంగా, దుడగొండ గ్రామానికి చెందిన దుడగొండ నారాయణ అనే రైతు తన వ్యవసాయ భూమిలో పత్తి పంటతో పాటు అంతర్ పంటగా గంజా మొక్కలను సాగుచేస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు అధికారులు తనిఖీలు నిర్వహించగా, నారాయణ వ్యవసాయ భూమిలో మొత్తం 155 గంజా మొక్కలు కనిపించాయి. బృందం వాటిని తక్షణమే లేఖించి, తొలగించి, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం నారాయణ్ఖేడ్ ఎక్సైజ్ స్టేషన్కు తరలించారు.ఈ ఆపరేషన్లో సీఐ శ్రీ దుబ్బాక శంకర్, ఎస్ఐ హనుమంతు, సిబ్బంది పండరి, సుభాష్, రాజేష్, సాయి శివకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# సూర్యాపేటలో పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్, సబ్సిడరీ పోలీస్ క్యాంటీన్ ప్రారంభించిన మంత్రి ఉత్తమ్



సందేశం టైమ్స్, సూర్యాపేట, 25 సెప్టెంబర్ 2025:నేరాల నియంత్రణ, సుపరిపాలనకై సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ పై విస్తృత ప్రచారం కల్పించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు.గురువారం ఆయన సూర్యాపేట జిల్లా కేంద్రంలో కొత్తగా నిర్మించిన పోలీస్ కాప్స్ ఫిట్‌నెస్ సెంటర్, సబ్సిడరీ పోలీస్ క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, "శాంతిభద్రతల పరిరక్షణ కోసం 24 గంటలు పనిచేసే పోలీస్ సిబ్బందికి సంక్షేమం ప్రభుత్వం భుజాన ఉందని" తెలిపారు.ప్రతినెల సరుకుల కొనుగోలులో ఆదా చేసేందుకు సబ్సిడీ క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్న ఆయన, సుమారు 1500 మంది పోలీస్ సిబ్బందికి దీని వల్ల మేలు కలుగుతుందన్నారు. ప్రతి పోలీస్ తప్పనిసరిగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు."తెలంగాణ పోలీస్ దేశానికి ఆదర్శం" అని పేర్కొన్న మంత్రి, మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గంజాయి నిర్మూలనలో భాగంగా కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, నకిలీ విత్తనాల నియంత్రణతో పాటు చౌకధర దుకాణాల బియ్యం అక్రమ రవాణా ఆపేందుకు చెక్‌పోస్టులు పటిష్టం చేయాలని, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని






పోలీసులను ఆదేశించారు.సూర్యాపేట పోలీస్ పరేడ్ గ్రౌండ్ నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ, పోలీస్ ప్రజా భరోసా ద్వారా మారుమూల గ్రామాలకు చేరుకుని ప్రజలకు శాంతిభద్రతలు అందిస్తున్నామని, 2025లో రోడ్డు ప్రమాదాలు తగ్గించడంలో విజయవంతమయ్యామని తెలిపారు. అలాగే గంజాను అరికట్టడంలో భాగంగా 110 కిలోల గంజా స్వాధీనం చేసుకున్నామని, సైబర్ నేరాల నియంత్రణలో కూడా మెరుగులు సాధిస్తున్నామని చెప్పారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, అదనపు ఎస్పీ, డీఎస్పీలు, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మోతే మండలాన్ని సస్య శ్యామలం చేసేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వేగవంతం - మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష







సందేశం టైమ్స్, సూర్యాపేట, 25 సెప్టెంబర్ రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి మోతే మండలంలో ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ సమీక్ష సమావేశంలో తెలిపారు, "ఇప్పటి వరకు ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టు చివరి ప్రాంతమైన మోతే మండలానికి సరైన నీటి సదుపాయం లేనందున, పాలేరు, మున్నేరు, సీతారామ ప్రాజెక్టుల ద్వారా నీటిని ఎత్తిపోసి 13 గ్రామాల్లో 32,417 ఎకరాలకు, మునగాల మండలంలోని 5 గ్రామాల్లో 9,053 ఎకరాలకు, నడిగూడెం మండలంలోని 3 గ్రామాల్లో 5,242 ఎకరాలకు, మొత్తం 46,712 ఎకరాలకు 467 క్యూసెక్ నీటిని 2 మోటార్ల ద్వారా సరఫరా చేయడం జరుగుతుంది" అని తెలిపారు.

మంత్రిగారు భూ సేకరణను వేగవంతం చేసి, రైతులకు న్యాయమైన నష్టపరిహారం మరియు భూసేకరణ అవార్డ్స్ తర్వాత వెంటనే చెక్కులు మంజూరు చేయాలని ఆర్డిఓలకు ఆదేశించారు. ప్రాజెక్టును సెప్టెంబర్ 2026 నాటికి పూర్తి చేసి 46,712 ఎకరాలకు సాగునీటి సదుపాయం కల్పించాలని కాంట్రాక్టర్ శ్రీనివాస్ రెడ్డికి సూచించారు.

కోదాడ శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి 2014లో మోతే మండలకు నీటివివిధ పథకాలలో నిర్లక్ష్యం జరిగిందని, ప్రభుత్వ ఏర్పాటుతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా మోతేను సస్యశ్యామలం చేయడానికి చర్యలు తీసుకుంటున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.సమావేశంలో ఇరిగేషన్ సీఈ రమేష్ బాబు, ఎస్ఈ శివధర్మతేజ, ఆర్డిఓ వేణుమాధవ్, పంచాయతీ రాజ్ ఈఈ వెంకటయ్య, తహసీల్దార్ వెంకన్న, సిడిపిఓ శ్రీవాణి, సూపర్ వైజర్, ఇరిగేషన్ అధికారులు మరియు సిబ్బంది హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో మోతే మండల కేంద్రంలో 12 లక్షల రూపాయలతో అంగన్వాడీ కేంద్రం మరియు విభలాపురం గ్రామంలో 3.5 కోట్ల రూపాయల బీటీ రోడ్ నిర్మాణంకి శంకుస్థాపన చేయబడింది



## సూర్యాపేటలో కొత్త డబుల్ బీటీ రోడ్ శంకుస్థాపన

సందేశం టైమ్స్, సూర్యాపేట, 25 సెప్టెంబర్ :హుజూర్నగర్ పట్టణంలో రాజీవ్ చౌక్ నుండి రామస్వామి గుట్ట వద్ద ఐటిఐ కాలేజీ వరకు 4.5 కిమీ పొడవైన డబుల్ బీటి రోడ్ నిర్మాణానికి 6.5 కోట్ల రూపాయల వ్యయంతో శంకుస్థాపన కార్యక్రమాన్ని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి చేపట్టారు.ఈ సందర్భంగా మంత్రి తెలిపారు, హౌసింగ్ కాలనీ ప్రారంభం తర్వాత రద్దీ సమస్యలు రావడానికి అవకాశం ఉందని, భవిష్యత్తులో పట్టణం పరిధిలో మరియు హౌసింగ్ కాలనీలో మిగిలిన సీసీ రోడ్లను డబుల్ బీటి రోడ్లుగా మలచుతామని తెలిపారు.కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, ఆర్ అండ్ బి ఈ ఈ సీతారామయ్య, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# న్యాల్కల్ మండలంలోని రేజింతల్ గ్రామంలో

## -నవరాత్రి ఐదవ రోజు అట్ల బతుకమ్మ సంబరాలు.

## -అతిధిగా హాజరైన జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 25సెప్టెంబర్: బతుకమ్మ తెలంగాణ రాష్ట్రంలో జరుపుకునే ముఖ్యమైన పండుగ. రకరకాల పువ్వులతో, భూమి, నీరు మరియు మానవుల మధ్య సంబంధాన్ని తెలియజేస్తుంది, ఐకమత్యాన్ని నెలకొల్పుతుంది. బతుకమ్మ పండుగా స్త్రీల సృజనాత్మకతను, సాంసృతికి ప్రతీక అని అన్నారు.అందుకే స్త్రీలు ఎలాంటి కష్టమైనా సవాలును ఎదురుకోవాల్సి వచ్చిన బలంగా ధైర్యంగా ముందుకు వెళ్లగలుగుతున్నారు మరియు సంరక్షించుకోగలుగుతున్నారు అని అన్నారు.ఈ కారిక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి , బ్లాక్ పార్టీ అధ్యక్షులు సామేల్ , మండల ముఖ్య మహిళా కాంగ్రెస్ నాయకురాలు మల్లిక, తుకారాం, గ్రామ నాయకులు ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి రెడ్డి, సీరజుద్దీన్,మహాముద్మీయ, మొషప్ప, సంగప్ప,పంచాయతీ కార్యదర్శి అరుణజ్యోతి, పెద్దసంఖ్యలో మహిళలు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# సాల్ట్ అమలు తీరు భేష్



అమరావతి సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): రాష్ట్రంలో సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) కార్యక్రమం అమలు తీరు బాగుందని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు ప్రశంసించారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు క్రిస్టెల్ కౌమే, సౌమ్య బజాజ్, యిన్‌విన్ ఖైన్, ప్రయాంక సాహు తదితరులు అసెంబ్లీలో మంత్రి లోకేశ్‌తో భేటీ అయ్యారు. సాల్ట్‌తో పాటు పాల్ (పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్), ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిట్రసీ, న్యూమరసీ) కార్యక్రమాలపై వారు చర్చించారు. లీప్ (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఏపీ) కార్యక్రమానికి సాల్ట్ ఉపయోగపడుతోందని లోకేశ్ అన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేయడానికి పాల్ ల్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. పాల్ ల్యాబ్స్‌తో టీచర్లు మరింత మెరుగైన ప్రణాళికతో బోధిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు కోన శశిధర్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఆఖరి కోసం పాట్లు

ఆదోని రూరల్, సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): ఆ గ్రామంలో శ్మశాన ఆఖరి(అంత్యక్రియలు) కార్యక్రమం చేపట్టడానికి కూడా పాట్లు తప్పడం లేదు. ఆదోని మండలం గణేకల్లులో శ్మశాన వాటికకు దారిలేదు. ఆ గ్రామంలో మరణించిన వారిని శ్మశాన వాటికకు తీసుకెళ్లాలంటే ప్రాణాలు తెగించి పాడి మోసుకొని రైలు పట్టాలను దాటాల్సిందే. ఈ క్రమంలో పలువురు ప్రాణాలు కూడా కోల్పో యారు. ఇటు ప్రజా ప్రతినిధులు, అటు అధికారులు కానీ ఈ సమస్యను పట్టించుకోవడం లేదు. గ్రామానికి చెందిన మేస్త్రీ పెద్ద లక్ష్మయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. అంత్యక్రియల కోసం శ్మశాన వాటికకు తీసుకెళ్లడా నికి కుటుంబ సభ్యులు



ఇబ్బందులు పడ్డారు. మార్గమధ్యలో రైలు పట్టాలు దాటేందుకు ఇబ్బందులు పడ్డారు.

# అంబేద్కర్ స్ఫూర్తిని చాటిచెప్పిన

# సంఘం శరణం గచ్ఛామి

సత్తెనపల్లి సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): కొందరి కోసం కాదు.. అణగారిన అందరి కోసం అంబేద్కర్ అని చెబుతూ స్థానిక లూథరన్ చర్చి ప్రాంగణంలో అభ్యుదయ ఆర్ట్స్ హైదరాబాద్ వారు ల రాత్రి ప్రదర్శించిన 'సంఘం శరణం గచ్ఛామి' నాటకం ఎంతగానో ఆకట్టుకుంది. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో, చర్చి సహకారంతో ఈ నాటకాన్ని ప్రదర్శించారు. అంబేద్కర్ జయంతి కార్యక్రమాలు, విగ్రహాల ఆవిష్కరణలను రాజకీయ నాయకులు వారి స్వప్రయోజనాలకు చేస్తున్నారేగాని అంబేద్కర్ చెప్పిన విలువలను మాత్రం పాటించరని, ఇది చూసి అంబేద్కర ఆత్మ ఘోషిస్తుందనే సన్నివేశంతో ప్రదర్శన ప్రారంభమైంది. పాఠశాలలో చదువుకునేటప్పుడు, ఆటలాడే సందర్భంలో తోటి పిల్లల నుండి అంబేద్కర్ ఎదుర్కొన్న తీవ్ర వివక్షను కళాకారులు కళ్లకుకట్టారు. ఎన్నో తీవ్రమనైన ఆర్థిక ఒడిదుడుకులు, కుటుంబ సమస్యలను అనుభవించి ఉన్నత విద్యను అభ్యసించిన ఘట్టాలను ప్రదర్శించారు. అందరిలో ఒకడు కాదు.. అందరి కోసం ఒక్కడుగా అంబేద్కర్ నిలవడం కోసం ఆయన భార్య చేసిన



త్యాగాలు, అనారోగ్యానికి గురైన బిడ్డకు వైద్యానికి డబ్బు లేక మరణించిన దైన్యం, తాళి అమ్మి అంబేద్కర్ చదువులకు పంపినీ సన్నివేశాలు కంటతడి పెట్టించాయి. చదువులు పూర్తయ్యాక ఇండియాకు వచ్చిన అంబేద్కర్ చేసిన పోరాటాలను ప్రదర్శించారు. రాజ్యాంగానికి తూట్లు పొడుతున్న పాలకులను ప్రశ్నిస్తూ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతినబూనగా అక్కడే ఉన్న అంబేద్కర్ ఆత్మ విగ్రహంలో విలీనమవడంతో ప్రదర్శన ముగుస్తుంది. ప్రదర్శనను చూడడానికి మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, వివిధ సంఘాల శ్రేణులు, పట్టణ ప్రజలు తరలివచ్చారు.

# కన్నా... నిలపాలని ఎత్తులో నాకన్నా!



కోటబొమ్మాళి, సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): ఈ ప్రపంచంలో బిడ్డలకు తండ్రి భుజం కంటే ఎత్తయిన ప్రదేశం ఉండదు. తండ్రులకూ అంతే... బిడ్డలను భు జాలపై మోసినపుడు వారి కళ్లలో కనిపించే ఆనందం కంటే గొప్పగా ఏమీ కనిపించదు. ఢిల్లీకి రాజైనా బిడ్డ ముందు పసిపిల్లాడైపోతాడు. ఇదిగో అలాంటి అరుదైన దృశ్యానికి కొత్తమ్మతల్లి వేడుక వేదికైంది. నిత్యం అధికారులకు ఆదేశాలిస్తూ...తన పరివారానికి సూచనలు...సలహాలిస్తూ... విధి నిర్వహణలో క్షణం తీ రిక లేకుండా ఉండే కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తండ్రి పాత్రలో పూర్తిగా ఒదిగిపోయారు. కోటబొమ్మా ళిలోనా కొత్తమ్మతల్లి ఉత్సవాలకు కలెక్టర్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. కొత్తపేట జంక్షన్ నుంచి తన కుమార్తెను భుజంపై ఎత్తుకొని... జనంతో పాటు సుమారు రెండు కిలోమీటర్లు నడిచి ఆలయం వద్దకు చేరుకున్నారు. కుమార్తెకు ఉత్సవాల విశేషా లను వివరిస్తూ... సాంస్కృతిక ప్రదర్శనలను చూపి స్తూ ముందుకు కదిలారు. ఓవైపు పోలీసులు.. మరోవైపు అధికారులు, సిబ్బంది ఉ ండగా... ఆ నడుమ కలెక్టర్ తన కుమార్తెతో నడిచి వెళ్లిన దృశ్యాన్ని చూసి భక్తులు ముచ్చటపడ్డారు.

# పట్టపగలే దారుణ హత్య

సత్తెనపల్లి టౌన్ సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): పట్టపగలే దారుణ హత్యతో సత్తెనపల్లి పట్టణం ఉలిక్కిపడింది. గురువారం జరిగిన ఘటనపై పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని కంబాలబావి వద్ద నివాసం ఉంటున్న ఆదాంషఫీ కుమార్తె అయిన అయిషాతో అదే వార్డుకు చెందిన కార్డు డ్రైవర్ షేక్ మస్తాన్(32)తో ఐదేళ్ల కిందట వివాహమైంది. కొంతకాలానికి వీరిమధ్య వివాదాలు వచ్చి కోర్టు కేసుల వరకూ వెళ్లింది. విడాకులు తీసుకునేందుకు రెండు నెలల కిందట పెద్దల సమక్షంలో ఇరుపక్షాలు అంగీకారానికి వచ్చారు. అయితే మస్తాన్‌పై అయిషా సోదరుడు షేక్ కరీముల్లా కక్ష పెంచుకున్నారు. గురువారం ఉదయం మృతుడు మస్తాన్ స్థానిక లక్ష్మి టాకీస్ సినిమా హాల్ వద్ద హొటల్లో టీ తాగుతుండగా కరిముల్లా హఠాత్తుగా కత్తితో విఛక్షణా రహితంగా దాడికి దిగాడు. తీవ్ర గాయాలపాలై రక్తపు మడుగులో పడిపోయిన మస్తాన్‌ను కొందరు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా కొద్ది సేపటికి మృతిచెందాడు. మృతదేహాన్ని డిఎస్పీ ఎం.హనుమంతరావు పరిశీలించి కుటుంబీకుల నుండి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. నిందితుడు కరీముల్లా పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం



# ఇళ్ల స్థలాల కోసం

# ఎరుకల కాలనీవాసుల ఆందోళన



మాచర్ల సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద స్థానిక తొమ్మిదో వార్డు ఎరుకల కాలనీ ప్రజలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా నిరుపేదలమని, సంచార జీవితం గడుపుతూ పొట్టపోసుకుంటున్నామని చెప్పారు. కాలనీవారం ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోగా కొందరికి ఇళ్ల స్థలాలు మంజూరైనట్లు చెబుతున్నారని, అయితే ఎవరికి మంజూరయ్యాయో వివరాలు మాత్రం తెలియడం లేదని చెప్పారు. ఇప్పటికే చిన్నిచిన్న పాకల్లో ఉంటున్న తాము ఆ చిన్న ఇంటిలోనే రెండు మూడు కుటుంబాలు కాపురం ఉండాల్సి వస్తోందని, తమ ఆవేదనను గుర్తించాలని కోరారు. తహశీల్దార్ కిరణ్ కుమార్ స్పందిస్తూ విఆర్ఓతో సర్వే చేయించి మంజూరైనవి కాకుండా, మిగిలిన అందరికీ స్థలాలిప్పిస్తామని హామీనిచ్చారు.

# ఆటో కార్మికుడు ఆత్మహత్య



విజయవాడ : సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): ఉచిత బస్సు పథకంతో కిరాయిలు కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో విజయవాడకు చెందిన ఓ ఆటో కార్మికుడు..ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల కథనం మేరకు..అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన పసుపులేటి సుబ్బారావు (23) ఆటో నడుపుకుండా జీవనం సాగిస్తున్నారు. ఆయనకు భార్య ధరణితోపాటు 18 నెలల బాబు ఉన్నాడు. సత్యనారాయణపురంలోని ఓ ఫైనాన్సర్ వద్ద ఆటోపై రూ.45 వేల రుణం తీసుకున్నారు. చక్రవడ్డీతో కలిపి రూ. లక్ష చెల్లించాలని, డబ్బులు చెల్లించకపోతే ఆటో స్వాధీనం చేసుకుంటానని ఫైనాన్సర్ వేధింపులకు పాల్పడ్డాడు. ఉచిత బస్సు పథకంతో కిరాయిలు తగ్గిపోవడంతో కిస్తీలు కూడా కట్టలేని పరిస్థితికి సుబ్బారావు వచ్చారు. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

# రెండో విడత డిగ్రీ అడ్మిషన్లకు షెడ్యూలు



అమరావతి, సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): రెండో విడత డిగ్రీ అడ్మిషన్లకు ఉన్నత విద్యామండలి బుధవారం షెడ్యూలు జారీచేసింది. ఈ నెల 26 నుంచి 29 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, 27 నుంచి 29 వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని, 29 నుంచి 1 వరకు వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చని తెలిపింది. 3న ఆప్షన్లు మార్చుకోవచ్చని, 6న సీట్ల కేటాయింపు జరుగుతుందని పేర్కొంది. 7, 8 తేదీల్లో విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించింది. కాగా, తొలి విడతలో 1,30,265 మందికి సీట్లు కేటాయించారు. వారిలో 1,22,955 మంది విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేశారు. ఇంకా 7,310 మంది రిపోర్టు చేయాల్సి ఉంది. వారిలో సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయనివారు ఇప్పుడు అప్‌లోడ్ చేస్తే వారికి రెండో విడతలో సీట్లు కేటాయిస్తామని ఉన్నత విద్యామండలి తెలిపింది.

# అటవీ శాఖలో అవినీతి..!



**అటవీ శాఖలో భారీ అవినీతి..!!**
**చాంద్‌బాషా వ్యవహారంలో ఆశ్చర్యపోయేలా అవకతవకలు**
**ఇప్పటివరకు రూ.7.5కోట్ల వరకు నిధులు దారి మళ్లింపు?**
**రేంజ్‌ల పరిధిలోనూ.. అక్రమాల ఊడలు**

%ఆత్మకూరు సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్):రాష్ట్రంలోనే సంచలనంగా మారిన అటవీశాఖ రిటైర్డు ఉద్యోగి చాంద్‌బాషా చేసిన అక్రమాలను పరిశీలిస్తే ఆశాఖలో అవినీతి హెచ్చుమీరినట్లు తెలుస్తోంది. ఈ అవకతవకల్లో కింది స్థాయి ఎఫ్‌బీఓల నుంచి ఐఎఫ్‌ఎస్ అధికారుల వరకు అడుగడుగున వారి పనితీరుపై అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. దీంతో ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా పరిగణించిన అటవీశాఖ ఉన్నతాధికారులు ఈ ఏడాది మే 19న ఒక ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించారు. వీరు చేపట్టిన విచారణలో రూ.7.5కోట్ల వరకు అక్రమాలు వెలుగుచూసినట్లు తెలిసింది. అయితే వాటికి సంబంధించి పూర్తిస్థాయిలో ఆధారాలు లభించకుండా చాంద్‌బాషా ఎక్కడికక్కడ తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు స్పష్టమవుతోంది.దీంతో విచారణ బృందం అధికారులు సైతం తలలు పట్టుకుని తాము పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయలేమంటూ చేతులెత్తేసినట్టు సమాచారం. ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ కార్యాలయం పరిధిలో అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్‌గా పని చేసి గత ఏడాది జూలై నెలలో పదవీవిరమణ పొందిన చాంద్‌బాషా చేసిన అక్రమాల్లో ప్రధానంగా చెక్‌పోస్టుల నుంచి వచ్చిన సొమ్మును ఆంధ్రప్రదేశ్ టైగర్ కన్జర్వేషన్ ఫండ్ (ఏపీటీసీఎఫ్), ఫారెస్టు డెవల్‌పమెంట్ ఏజెన్సీ (ఎఫ్‌డీఏ) తదితర సంస్థలకు చెక్కులను ఆర్టీజీఎస్ ద్వారా బదిలీ చేసినప్పుడు మాత్రమే చేతివాటం ప్రదర్శించి ఆ చెక్కులను దారిమళ్లించినట్లు తొలుత అధికారులు గుర్తించారు. ఈ లెక్కన జూన్ 21వ తేది వరకు జరిగిన విచారణలో రూ.4.37కోట్ల వరకు నిధులు స్వాహా చేసినట్లు నిర్ధారించారు. ఆతర్వాత కూడా చేపట్టిన విచారణలో చాంద్‌బాషా అటవీశాఖలోని వివిధ పథకాలకు సంబంధించి నిధుల విషయంలో కూడా గోల్‌మాల్ జరిగి మరో రూ.3కోట్లకు పైగా అక్రమాలు వెలుగుచూసినట్లు తెలిసింది. కింది స్థాయి అటవీ సిబ్బంది మొదలుకుని కొందరు రేంజర్లను కూడా భాగస్వాముల్ని చేసి నిధులను దారిమళ్లించినట్లు సమాచారం.

# టమోటాను మేమే కొనుగోలు చేస్తాం..



అనంతపురం: సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో టమోటా కొనుగోలు చేస్తామని ఆ శాఖ ఏడీ రాఘవేంద్ర కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులు టమోటా కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని సూచించారని తెలిపారు. ఈ మేరకు రాప్తాడు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో టమోటా కొనుగోలు చేపట్టామని తెలిపారు. కిలో రూ.20తో కొనుగోలు చేశామని పేర్కొన్నారు.%వాటిని వైజాగ్‌లోని రైతుబజారుకు తరలించామని అన్నారు. ప్రస్తుతం అక్కడ ధరలు ఎక్కువగా ఉండటంతో ఇక్కడి నుంచి కొనుగోలు తరిస్తున్నామని తెలిపారు. దీని వలన ఇక్కడి రైతులకు లాభం చేకూరడంతోపాటు..ఎగుమతి ప్రాంతాల్లోని ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు.

# పని గంటల పెంపుపై ఆగ్రహం



మంగళగిరి, తాడేపల్లి రూరల్, గుంటూరు సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): పని గంటలు పెంచుతూ శ్రామిక వర్గాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోపిడీ చేస్తున్నాయని వామపక్ష పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు మండిపడ్డారు. పనిగంటల పెంపుని నిరసిస్తూ జిల్లాలోని పలుచోట్ల బుధవారం నిరసనలు చేపట్టారు. మంగళగిరిలోని పాతబస్టాండు వద్ద ఎఐటియుసి, సిఐటియు, సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలపగా తాడేపల్లి మండలం కుంచనపల్లిలో పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు. గుంటూరు నగరంలోని ఆటో నగర్ వంద అడుగుల రోడ్డులో కార్మికులు ఆందోళన నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ తోపాటు ఇతర నాయకులు మాట్లాడుతూ పెట్టుబడిదారులు, కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకుంటూ కార్మిక వర్గాన్ని అణగదొక్కు తున్నాయని అన్నారు. 139 సంవత్సరాలుగా అనేక మంది ప్రాణ త్యాగాలతో సాధించిన ఎనిమిది గంటల పని దినాన్ని 13 గంటలకు పెంచడం కార్మిక హక్కులపై దాడి అని మండిపడ్డారు. మహిళలకు పగలే రక్షణ కల్పించలేని ప్రభుత్వాలు వారిని రాత్రి పూట పనుల్లో పెట్టేలా చేయడం దుర్మార్గమన్నారు. కార్మిక చట్టాలు రద్దు చేసి, లేబర్ కోడ్‌లు తెచ్చిన కేంద్రం బాటలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తోందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల ఆదాయాలు లేక కొనుగోలు శక్తి తగ్గిపోతోందని, నిరుద్యోగం పెరుగుతున్న ఈ తరుణంలో పనిగంటలు పెంచటం దారుణమని అన్నారు. దీని వల్ల నిరుద్యోగం మరింత దిగజారుగుతుందన్నారు. రాష్ట్రంలో షెడ్యూల్డ్ లేబర్‌కు గత 20 ఏళు ్లగా వేతనాలు సవరించకపోగా పనిగంటలు పెంచటానికి మాత్రం సిద్ధమైందని విమర్శించారు. కనీస వేతనాలను పెంచి, సమయానికి చెల్లించాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మంగళగిరి నిరసనలో నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, ఎం.బాలాజీ, ఎ.ప్రభాకర్, చిన్ని సత్యనారాయణ, జెవి రాఘవులు, పి.బాలకృష్ణ, ఎస్.గణేష్, ఎన్.బ్రహ్మేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, యు.శ్రీనివాసరావు, ఎన్.చిన్న, బి.శ్రీను, శ్రీనివాసరావు ఎం.వాసు, వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు. కుంచనపల్లిలో డి.వెంకటరెడ్డి, పి.కృష్ణ, పారిశుధ్య కార్మికులు జోజిబాబు, కృష్ణ తులసి, కోటేశ్వరి, రాంబాబు, ప్రసాద్, ఇస్సాక్ పాల్గొన్నారు. గుంటూరులో ఆటోనగర్ కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, సిఐటియు గుంటూరు పశ్చిమ కమిటీ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, అల్యూమినియం వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.సాంబశివరావు, కోశాధికారి దయానందం, జి.శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

# పసుపు సాగులో కొత్త పద్ధతులు...
# అంతర పంటగా బొప్పాయి



దువ్వూరు సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): పసుపు సాగులో ( రైతులు కొత్తపద్ధతులు అవలంభిస్తున్నారు. పసుపుతో పాటు అంతర పంటగా బొప్పాయి సాగు చేపడుతున్నారు. డ్రిప్ ఏర్పాటు చేసి నీటి తడులు అందించ డంతో తోటలు ఏపుగా పెరిగి కళకళలాడుతున్నాయి. మైదుకూరు ప్రాంతం పసుపు సాగుకు పెట్టింది పేరు. ఇక్కడ పండిన పసుపు పంట నాణ్యత పరంగా వ్యాపారులను ఆకర్షిస్తోంది. దువ్వూరు, ఖాజీపేట, మైదుకూరు, చాపాడు మండలాల్లో విస్తృతంగా ఈ పంటను సాగుచేశారు.పంట సాగుకు ఖర్చులు పెరిగిన నేపథ్యంలో సైతం పంట వేసేందుకు రైతులు వెనుకాడటం లేదు. మార్కెట్‌లో వట్టి పసుపునకు డిమాండ్ ఉండడం, మంచి ధరలు పలకడంతో రైతులు ఈ సంవత్సరం కూడా పసుపు సాగుకు ఎక్కువ ఆసక్తి కనపరిచారు. దువ్వూరు మండలంలో కిందటి సంవత్సరం 582 ఎకరాల్లో సాగైనట్లు అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి. ఈ సంవత్సరం అదనంగా మరో వంద ఎకరాల్లో విస్తీర్ణం పెరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఇక ఈ ఏడాది రైతులు పసుపులో అంతర పంటగా బొప్పాయిని సాగు చేశారు. తద్వారా తెగుళ్ల నివారణకు ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. ఇక పసుపు పంటలో డ్రిప్ విధానం అవలంభించేందుకు రైతులు ఆసక్తి కనపరుస్తున్నారు. తద్వారా తోటలు ఏపుగా పెరిగి అధిక దిగుబడులు వచ్చేందుకు తోడ్పడుతుందని అధికారులు తెలుపుతున్నారు. ప్రస్తుతం డ్రిప్ ఏర్పాటు చేసిన తోటలు కళకళలాడుతున్నాయి.

**డ్రిప్‌తో బహుళ ప్రయోజనాలు**

పసుపు సాగులో డ్రిప్ ఏర్పాటు చేయడం వలన ప్రయోజనాలు మెండుగా ఉన్నాయి. నేరుగా మొక్కకు నీరు అందుతుంది. నీటి వృథాను అరికట్టవచ్చు. ఎరువులను మొక్కకు అందేటట్లు చేయవచ్చు. కలుపు తగ్గుతుంది. ఖర్చులు ఆదా అవుతాయి. దిగుబడి పెరిగి రైతుకు లాభసాటిగా ఉంటుంది.

# రైతుల్ని దెబ్బతీస్తున్న ముంపు



తాడేపల్లి రూరల్ :"సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): అధిక వర్షాల సందర్భంలో పొలాలు ముంపుబారిన పడకుండా అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు డిమాండ్ చేశారు. కొలనుకొండ, వడ్డేశ్వరం గ్రామాల పరిధిలోని ముంపు పొలాలను ఆయన సిపిఎం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ డ్రెయినేజీ బోర్డు నిర్లక్ష్యం వల్ల కొలనుకొండ, వడ్డేశ్వరం, గుండిమెడ, మెల్లంపూడి, కుంచనపల్లి గ్రామాల్లో పొలాలు నీట మునిగాయని, రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంట చేతికందే సమయంలో ఈ పరిస్థితి రైతుల్ని తీవ్రంగా దెబ్బతీసిందని అన్నారు. భారీ వానల వల్ల ఇటీవల కాలంలో అనేకసార్లు వందల ఎకరాల పంటలు నీట మునిగాయని గుర్తు చేశారు. కుంచనపల్లి గ్రామం అపర్ణ అపార్ట్మెంట్ వద్ద నుండి ప్రాతూరు, కుంచనపల్లి మీదుగా గుండిమెడ, మెల్లంపూడి, వడ్డేశ్వరం కొలనుకొండ కెఎల్‌యు వరకు ఉన్న పొలాల డ్రెయినేజీ కాల్వ శుభ్రం చేయక, పూడుకు పోవడం వల్ల ముంపు సమస్య వచ్చిందని వివరించారు. 1996 ప్రాంతంలో అప్పటి సిపిఎం ఎమ్మెల్యే నిమ్మగడ్డ రామ్మోహన్‌రావు%ు% పొలాల్లోని నీరు బయటకు పోవడానికి వీలుగా పంట కాల్వలను శుభ్రం చేయించారని, ఆ తర్వాత పట్టించుకున్న వారు లేరని విమర్శించారు. కెఎల్‌యు వైపు నుండి గుండిమెడ వైపు వెళ్లే రహదారి ఎత్తు పెంచడం వల్ల పొలాలు లోతట్టుగా మారాయని, డ్రెయినేజీ కాల్వలు పూడుకుపోయాయని, రైతులే రోడ్డుకు గండి కొట్టి, వర్షపు నీటిని బయటికి పంపేందుకు తిప్పలు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. తక్షణమే కాల్వలు పూడిక తీయించి, అవసరమైన చోట కల్వర్టులు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. పరిశీలనలో సిపిఎం సీనియర్ నాయకులు డి.వెంకటరెడ్డి, మండల కార్యదర్శి పి.కృష్ణ, నాయకులు ఎన్.విజయరాజు, జి.వెంకటేశ్వరరావు, ఎల్.కోటేశ్వరరావు, రైతులు ఎం.వెంకట శివయ్య, వి.శ్రీనివాసరావు, కె.ఉష పాల్గొన్నారు.

# వైరస్‌కు వేపనూనెతో చెక్ : జేడీఏ



ఉరవకొండ, సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): కంది పంటలో అక్కడక్కడా వైరస్ తెగుళ్లు ఉ ందని, వేపనూనె, వేపగింజల కషాయాన్ని పిచికారి చేసి దాన్ని నివారించుకోవచ్చని జేడీఏ ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. మం డలంలోని చిన్నముష్టూరు గ్రామంలో నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కందికి పూత దశలో వచ్చే మరక మచ్చ తెగుళ్లు నివారణకు క్లోరో నెట్రీ, నిర్రోఫిల్ అనే మందు ను 60 మిల్లీలీటర్లను ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సత్యనారాయణ, ఏఓ రామకృష్ణుడు పాల్గొన్నారు.

# పైపులైనకు మరమ్మతులు చేయండి



కొత్తచెరువు, సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): మండల పరిధిలోని తిరుమలదేవరపల్లిలో తాగునీటి పైపులైన పగిలిపోయి నీరు వృథా గా రోడ్డుపై పారుతోంది. దాదాపు 20 రోజుల క్రితం ఈ పైపులైన పగిలిపోయిందని గ్రామస్థులు తెలిపారు. దీంతో నీరు ట్యాంకుకు వెళ్లడంలేదని, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాని వాపో యారు. నీరంతా రోడ్డుపై నిలబడుతూ మడుగును తలపిస్తోందని అంటున్నారు. దీంతో దోమలు అధికమై గ్రామంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. తాగునీటి పైపులైనకు మరమ్మ తులు చేయాలని పంచాయతీ కార్యదర్శికి, సర్పంచకు తెలిపిపా వారు పట్టించుకోలేద న్నారు. ఇప్పటికైనా ఉన్నతాదికారులు స్పందించి గ్రామంలో పగిలిపోయిన తాగునీటి పైపులైనకు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# గంజాయి అక్రమ రవాణా కేసులో
# నిందితుడికినాలుగేళ్ల జైలుశిక్ష

టెక్కలి, సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): గంజాయి అక్రమ రవాణా కేసులో బుడుమూరు నాగరాజు అనే వ్యక్తికి నాలుగేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10వేల జారిమానా విధిస్తూ శ్రీకాకుళం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి పి.భాస్కరరావు తీర్పు వెల్లడించారని టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు తెలిపారు. 2023 జనవరి 1న టెక్కలి జగతిమెట్ట సర్వీస్ రహదారిపై పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా, నాగరాజు తన ద్విచక్ర వాహనంపై ఒడిశా రాష్ట్రం చీకటి గ్రామం నుంచి గంజాయిని జిల్లాలోకి తీసుకు వస్తుండగా అప్పటి టెక్కలి ఎస్ఐ ఎల్.రామకృష్ణకు పట్టుబడ్డాడు. నాగరాజు నుంచి రూ.27,500 విలువగల 5కేజీల 450 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి సీఐ సూర్యచంద్రమౌళి కేసు దర్యాప్తు చేశారు. ఈ కేసును స్పెషల్ పీపీ కింజరాపు శ్రీనివాసరావు వాదించారు. నేరం రుజువు కావడంతో నాగరాజుకు కోర్టు జైలు శిక్ష విధించినట్లు డీఎస్పీ తెలిపారు. రూ.10వేల జరిమానా చెల్లించని యెడల ఆరు నెలల పాటు సాధారణ జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయాధికారి తీర్పులో పేర్కొన్నారు.

# గే యాప్ ద్వారా ఛాటింగ్.. హెూటల్‌కు వెళ్తే ఛీటింగ్..

సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): ప్రముఖ గే యాప్ అయిన గ్రైండర్ యాప్ ద్వారా పరిచయమైన యువకుడి చేతిలో మోసపోయిన మరో యువకుడు మాదాపూర్ పోలీసులను ఆశ్రయించాడు. గ్రైండర్ యాప్ ద్వారా ఇద్దరు యువకులు ఛాటింగ్ చేసుకున్నారు. ఆ ఇద్దరిలో ఒకరు మాదాపూర్‌లో డాక్టర్‌గా పని చేస్తున్నారు. ఇద్దరూ కలవాలని నిర్ణయించుకుని అయ్యప్ప సొసైటీలో ఓయో రూమ్ బుక్ చేసుకున్నారు ఆ ఓయో రూమ్‌కు వెళ్లిన తర్వాత డాక్టర్‌పై మరో యువకుడు అఘాయిత్యానికి పాల్పడడానికి ప్రయత్నించాడు. డాక్టర్ నిరాకరించటంతో అతడిపై దాడికి దిగాడు. తనకి డబ్బులు ఇవ్వకుంటే ఇలా ప్రైవేట్ గా కలిసిన విషయాన్ని ఇంట్లో చెబుతానని డాక్టర్‌ను ఆ యువకుడు బెదిరించాడు. దీంతో భయపడిన డాక్టర్ 5000 రూపాయలు చెల్లించి అక్కడి నుంచి బయటపడ్డాడు.బయటికి వచ్చాక ఆ డాక్టర్‌ను ఆ యువకుడు ఫాలో అయ్యాడు . డాక్టర్ పనిచేస్తున్న హాస్పిటల్ కి వెళ్లి న్యూసెన్స్ క్రియేట్ చేశాడు.




మరిన్ని డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. దీంతో సదరు డాక్టర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు గాలింపులు చేపడుతున్నారు.

# సిలిండర్ పేలితే.. భారీగా పరిహారం.. ఈ విషయం తెలుసా?




హైదరాబాద్, సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): ప్రస్తుతం గ్యాస్ ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయి. ఈ పేలుడు దాటికి కొన్నిసార్లు ప్రాణ నష్టం.. మరికొన్ని సార్లు తీవ్ర గాయాలుపాలవుతున్నారు. వంట గ్యాస్ విషయంలో.. ఏ మాత్రం అప్రమత్తంగా లేకుంటే కచ్చితంగా ప్రమాదం బారిన పడతామన్నది సుస్పష్టం. అయితే మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా.. ప్రమాదం జరిగితే వినియోగదారులకు గరిష్టంగా రూ. 50 లక్షల వరకు బీమా అందుతుందన్న విషయం చాలా కొద్ది మందికి మాత్రమే తెలుసు. అది కూడా మనం ఒక్క రూపాయి చెల్లించకుండానే ఇది సాధ్యమవుతుందన్నది సుస్పష్టం. గ్యాస్ సిలిండర్ మనం బుక్ చేయగానే బీమా సైతం వర్తిస్తుందన్న విషయం చాలా మందికి తెలియదు.గ్యాస్ సిలిండర్ పేలి ప్రమాదం జరిగిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్, ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్, ఏజెన్సీకి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. వారు వచ్చి ప్రమాద ఘటనపై విచారణ జరుపుతారు. సిలిండర్ పేలడం వల్ల ప్రమాదం జరిగిందని భావిస్తే.. సంబంధిత ఆయిల్ కంపెనీ, బీమా సంస్థకు డిస్ట్రిబ్యూటర్ సమాచారం అందిస్తారు. బీమా పొందేందుకు మరణ ధృవీకరణ పత్రం, పోస్టుమార్టం నివేదిక, చికిత్సకు సంబంధించిన మెడికల్ బిల్లులు, రసీదులు ఇవ్వాల్సి ఉంటుంది. 2019 లోక్‌సభలో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ఎల్‌పీజీ పేలుడు బాధితులకు బీమా అందిస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే.కేవలం ఆస్తి నష్టం జరిగితే రూ. 2 లక్షల బీమా వస్తుంది. ప్రమాదంలో మృతి చెందితే వ్యక్తిగత ప్రమాద బీమా కింద రూ. 6 లక్షలు పొందుతారు. ప్రమాదం బారిన పడి చికిత్స పొందుతున్న ఒక్కో సభ్యుడికి రూ. 2 లక్షలు ఇస్తారు. కుటుంబం మొత్తానికి గరిష్టంగా రూ. 50 లక్షల బీమా అందనుంది.గ్యాస్ బండ పేలుడు సంభవించిన వెంటనే స్థానిక డిస్ట్రిబ్యూటర్‌కు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. దాంతో పాటు 1906కి ఫోన్ చేసి వివరా లు చెప్పాల్సి ఉంటుంది. డిస్ట్రిబ్యూటర్లు సంబంధిత గ్యాస్ కంపెనీలకు సమాచారం ఇస్తారు. సదరు కంపెనీ ప్రతినిధులు వచ్చి జరిగిన ప్రమాదాన్ని పరిశీలించి. వివరాలు నమోదు చేసుకుంటారు.

# చేపా చేపా ఎందుకు పెరగట్లే.. మత్స్యకారుల ఆవేదన

నల్లగొండ జిల్లా సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): నిడమనూరు మండలం ఇండ్లకోటయ్యగూడెం వద్ద ఉన్న బీజోత్పత్తి క్షేత్రంలోని చేపలు 'చేపా చేపా ఎందుకు పెరగట్లే అంటే పట్టించుకునే వారేరని అంటున్నట్లు ఉన్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విస్తారమైన భూమి, నీటి వనరులు ఉన్నా ఈ క్షేత్రం నిర్వహణ అధ్వానంగా మారడంతో తమకు ఈ పరిస్థితి దాపురించిందని చేపలు మొరపెట్టుకున్నట్లే ఉందని మత్స్యకారులు చెబుతున్నారు. నర్సరీల్లో మాత్రమే ఏదో మొక్కుబడిగా పిల్లలను పెంచుతున్నారు. కానీ పాండ్స్ వృథాగా ఉంటున్నాయని, దీంతో ఈ క్షేత్రం మత్స్యకారులకు ఎలాంటి చేయూతనివ్వడం లేదని వారంటున్నారు. మత్స్యసంపదను పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం తుమ్మడం శివారు ఇండ్లకోటయ్యగూడెం గ్రామంలో 1990లో 75 ఎకరాల విస్తీర్ణంలో మత్స్య బీజ క్షేత్రం ఏర్పాటు చేసింది. 2.5 కోట్ల చేపపిల్లలు ఉత్పత్తి చేసేందుకు అవసరమైన 20 నర్సరీలు, 38 పాండ్స్ నిర్మించింది. ఉత్పత్తి చేసిన చేపపిల్లలను జిల్లాలోని మత్స్య సొసైటీల ద్వారా చెరువుల్లో వదిలి మత్స్య సంపదను అభివృద్ధి చేయడంతో పాటు మత్స్యకారులకు దోహదం చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం.అయితే మొదట్లో ఇక్కడ ఉత్పత్తి చేసిన చేపపిల్లలను చుట్టుపక్కల మండలాల్లోని చెరువుల్లో వదిలే వారు. కానీ గత ప్రభుత్వం మత్స్య బీజ క్షేత్రం నిర్వహణను వరంగల్ జిల్లాకు చెందిన ఓ ప్రైవేట్ ఏజెన్సీకి లీజుకు అప్పగించింది. కానీ మూడేళ్ల పాటు ఇక్కడ ఎలాంటి ఉత్పత్తి చేపట్టలేదు. అనంతరం అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు లీజు రద్దు చేయించారు. దీంతో ఇటీవలి ప్రభుత్వమే దీనిని నిర్వహిస్తోంది.

నల్లగొండ జిల్లాలో 249 మత్స్య సహకార సొసైటీలు పనిచేస్తున్నాయి. ఇండ్లకోటయ్యగూడెం



మత్స్య బీజ క్షేత్రంలో లక్ష్యం మేరకు చేపపిల్లలు ఉత్పత్తి చేస్తే సొసైటీల పరిధిలోని చెరువులకు చేపపిల్లలు పంపిణీ చేయవచ్చు. మత్స్యకారులకు కూడా చేయూతనిచ్చేందుకు ఎంతో కొంత దోహదపడుతుంది. కానీ క్షేత్రం నిర్లక్ష్యానికి గురికావడంతో చెరువుల్లో వదిలేందుకు సరిపడా చేపపిల్లల ఉత్పత్తి లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి పిల్లలను కొనుగోలు చేయాల్సి వస్తోంది. చెరువుల్లో ఎంతమేరకు వదులుతున్నారో తెలియని పరిస్థితి ఉంది. అధికారులు మాత్రం లక్షల సంఖ్యలో పిల్లలను వదులుతున్నట్లు చెబుతున్నారు.

# భద్రాద్రి కొత్తగూడెంకు ప్రమాద హెచ్చరిక జారీ..

భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): తెలంగాణ రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు వర్షాలకు వాగులు, నదులు పొంగిపొర్లుతున్నాయి. ఈ మేరకు గోదావరి, మూసి నదులు ఉగ్రరూపం దాల్చాయి. నదులకు ఇంకా వరద ప్రవాహం తీవ్రంగా కొనసాగుతోంది. కాగా, రాష్ట్రానికి ఇంకా వర్ష సూచన ఉండటంతో.. పలు జిల్లాలకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. అటవీ ప్రాంతాల ప్రజలు కాలువలు, వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు.ఈ నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు అధికారులు రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. భద్రాచలం వద్ద గోదావరి నదిలో వరద ఉధృతి తీవ్రంగా పెరుగుతున్న కారణంగా రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అయితే.. 43 అడుగుల నీటిమట్టం వద్ద మొదటి హెచ్చరిక జారీ చేయగా.. ఇప్పుడు నీటిమట్టం 48 అడుగులకు చేరుకోవడంతో రెండవ హెచ్చరిక




ప్రకటించారు. దీంతో జిల్లా యంత్రాంగం అలర్ట్ అయ్యింది. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ మేరకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

# తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడి.. బత్తి సాగు లాభాలివే..




తలమడుగు , సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి వ్యవసాయ అధికారుల సూచనలతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం అందిచే పంటను వేసి ఆదర్శంగా నిలుస్తున్నారు రైతు కేమ పొచ్చన్న. వడ్డాడికి చెందిన రైతు తనకున్న మూడెకరాల భూమిలో ఎకరంలో బంతిపూల పంట ను సాగు చేసేందుకు ముందుకొచ్చారు. ఉద్యానవనశాఖ అధికారులు అందించిన సలహాలు, సూచనలు పాటించారు. ఎకరానికి రూ.40 వేల నుంచి రూ.50 వేల పెట్టుబడి పెట్టి రూ.2 లక్షల ఆదాయం పొందారు. తన మిగతా భూమిలో ఎకరం కూర గాయలు, మరో ఎకరం ఆకుకూరలు, ఇంకొక ఎకరంలో బంతిపూలు వేసి ఎకరంలో రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నాడు. కేవలం 100రోజుల పంటను సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు.

ప్రస్తుతం బతుకమ్మ పండుగ సీజన్ కావడం తో బంతిపూలకు భలే డిమాండ్ పెరిగింది. కిలో బంతిపూలు రూ.100–150 ధర పలుకుతోంది. బ తుకమ్మ పండుగ సీజన్ కావడంతో డిమాండ్ పెరగడంతో లాభాలను గడిస్తున్నారు. పూలు కావాల్సిన వారు పొచ్చెన్న పొలానికి వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. తలమడుగు, కొత్తూరు, లింగి, కుచులాపూర్‌లో ఇలాంటి రూతులు చాలామంది ఉన్నారు. వారికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే ఇంకొంత మంది రైతులు ముందుకొచ్చే అవకాశం ఉంది.

# బాలికలపై లైంగిక దాడి.. నిందితులు అరెస్ట్




హైదరాబాద్ సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): హైదరాబాద్‌లోని అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకొంది. విహారయాత్ర పేరుతో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులను యాదగిరిగుట్టకు తీసుకు వెళ్లి.. వారిపై ముగ్గురు యువకులు లైంగిక దాడికి పాల్పడ్డారు. అనంతరం ఆ బాలికలను తార్నాకలో విడిచి వెళ్లిపోయారు. జరిగిన ఘటనను ఆ బాలికలు.. తమ తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా ఆ ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం.. అల్వాల్ ప్రాంతానికి చెందిన ముగ్గురు బాలికలు ఒకే పాఠశాలలో చదువుకుంటున్నారు. అయితే సెప్టెంబర్ 20వ తేదీన స్కూల్లో బతుకమ్మ వేడుకలున్నాయని వారు ఇంట్లో చెప్పి.. బయటకు వెళ్లారు. ఆ క్రమంలో మాణికేశ్వర్ నగర్‌కు చెందిన జీహెచ్‌ఎంసీ కాంట్రాక్ట్ ఉద్యోగి మధుతో వీరికి పరిచయం ఏర్పడింది. ఈ బాలికలు యాదగిరిగుట్టకు వెళ్తున్నట్లు.. వారి మాటల ద్వారా మధు తెలుసుకున్నాడు.అనంతరం అతడు స్నేహితులు వంశీ అరవింద్, నీరజ్‌లను ఫోన్ చేసి పిలిచాడు. తాము కూడా యాదగిరిగుట్టకు వెళ్తున్నామని తెలిపారు. దీంతో ఆరుగురు యాదగిరిగుట్టకు వెళ్లారు. దేవుని దర్శనం అనంతరం స్థానిక లాడ్జిలో ఈ యువకులు మూడు గదులు అద్దెకు తీసుకున్నారు. ఆ తర్వాత ఆ యువతులపై యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ మరునాడు వీరిని హైదరాబాద్‌లోని తార్నాకలో దింపేశారు.మరోవైపు.. అప్పటికే తమ కుమార్తెలు కనిపించడం లేదంటూ అల్వాల్ పోలీసులను వారి తల్లిదండ్రులు ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ఇంటి నుంచి వెళ్లి మరునాడు తిరిగి రావడంతో.. ఆ బాలికలను వారి తల్లిదండ్రులు ప్రశ్నించారు. దీంతో జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు బాలికలు తెలిపారు. దాంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి.. వారిని అరెస్ట్ చేశారు. వైద్య పరీక్షల కోసం బాలికలను ఆసుపత్రికి తరలించారు.

# ఆర్టీసీ కీలక నిర్ణయం.. కొత్తగా 10 డిపోలు

హైదరాబాద్ సిటీ: సెప్టెంబర్ 25 (సందేశం టైమ్స్): కొత్తగా 10 ఆర్టీసీ డిపోల ఔటర్‌రింగ్ రోడ్డు లోపల శివారు ప్రాంతాల్లో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఆర్టీసీ సన్నద్ధం అవుతోంది. మేడ్చల్, రంగారెడి, సంగారెడజిల్లాల్లో కొత్త డిపోలు ఏర్పాటుకు స్థలాలు కేటాయించాలంటూ ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించింది. గ్రేటర్‌జోన్ పరిధిలో ఆర్టీసీ 3 వేలకు పైగా బస్సులు నడుపుతుంటే అందులో 2700 డీజిల్ బస్సులు ఉన్నాయి. వచ్చే రెండేళ్లలో గ్రేటర్‌లో కేవలం ఎలక్ట్రిక్ బస్సులు మాత్రమే నడపాలని ప్రభుత్వ ఆదేశాలున్నాయి.%2 వేల ఎలక్ట్రిక్ బస్సులు కేంద్ర ప్రభుత్వం పీఎం ఈ–డ్రైవ్ కింద మంజూరు చేయడంతో కొత్త డిపోలు, ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై ఆర్టీసీ అధికారులు దృష్టి సారించారు. శామీర్‌పేట, పెద్దఅంబర్‌పేట, తుక్కుగూడ, ఘట్‌కేసర్, కీసర, దుండిగల్, పటాన్‌చెరు రామచంద్రాపురంతో పాటు జాతీయ రహదారికి సమీపంలో కొత్త డిపోల ఏర్పాటుకు స్థలాలు కేటాయిస్తే ప్రయోజనం చేకూరుతుందని సీనియర్ రిటైర్డ్ అధికారులు సూచిస్తున్నారు.నగరంలోని ప్రధాన బస్టాండ్లయిన ఎంజీబీఎస్, జేబీఎస్?తో పాటు ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, బీహెచ్‌ఈఎల్ ప్రాంతాల నుంచి జిల్లాలకు ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. భవిష్యత్‌లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయి. ఎలక్ట్రిక్ బస్సులువిడతల వారీగా వస్తున్న రీత్యా వచ్చే రెండేళ్లలో ఓఆర్ఆర్ లోపల 8–10 ఎకరాల్లో ఈ కొత్త డిపోలు ఏర్పాటు చేస్తే ఎక్కువ సంఖ్యలో ఈవీ చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేసుకోవచ్చని తలుస్తోంది. జిల్లాల బస్సులు రాత్రి సమయంలో ఆయా డిపోల్లో పెట్టినప్పుడు చార్జింగ్ ఫుల్ చేసుకునే సౌకర్యాలు కల్పించాలని యత్నిస్తోంది.




# క్రీడావార్తలు




## ఇండియా ఏ జట్టు కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్.
## . రెడ్ బాల్ క్రికెట్‌కు 6 నెలల విరామం



కాన్పూర్‌లో సెప్టెంబర్ 30 నుంచి ఆస్ట్రేలియాతో జరిగే మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌కు శ్రేయస్ అయ్యర్‌ను ఇండియా ఏ జట్టు కెప్టెన్‌గా బీసీసీఐ నియమించింది. ఇది శ్రేయాస్‌కి భవిష్యత్తులో సీనియర్ వన్డే జట్టులో నాయకత్వ భాధ్యతలు చేపట్టే అవకాశం కల్పించనుంది. అయితే, ఆయన వచ్చే ఆరు నెలలు రెడ్ బాల్ క్రికెట్‌కు దూరంగా ఉండనున్నారు.శ్రేయస్ అయ్యర్ ఇటీవల బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగర్కర్‌కు తన వెన్ను గాయం కారణంగా రెడ్–బాల్ క్రికెట్ ఆడలేనని తెలిపారు. గతంలో యూకేలో వెన్ను శస్త్రచికిత్స చేయించుకున్న అయ్యర్, రికవరీ తర్వాత కూడా దీర్ఘకాల ఫార్మాట్ ఆడుతున్నప్పుడు వెన్ను నొప్పి సమస్య ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆరు నెలల పాటు రెడ్–బాల్ క్రికెట్‌కు దూరంగా ఉండి, తన శరీర సామర్థ్యాన్ని, ఫిట్‌నెస్‌ను మెరుగుపరచుకోవాలని నిర్ణయించారు. ఈ కారణంగా అక్టోబర్ 1 నుంచి నాగ్‌పూర్‌లో విదర్భతో జరిగే ఇరానీ కప్ మ్యాచ్‌కు అతన్ని ఎంపిక చేయలేదు. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఒక ప్రకటనలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఇండియా ఏ జట్టులో శ్రేయస్ అయ్యర్‌తో పాటు రవి బిష్ణోయ్, వికెట్ కీపర్–బ్యాట్స్‌మన్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్, ఆల్‌రౌండర్ రియాన్ పరాగ్, ఆయుష్ బదోనీ వంటి కీలక ఆటగాళ్లు ఉన్నారు. ఈ జట్టు ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్‌లో మంచి ప్రదర్శన చేయాలని భావిస్తోంది.ప్రస్తుతం ఆసియా కప్ కోసం యూఏఈలో ఉన్న హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, అక్టోబర్ 3, 5 తేదీల్లో జరిగే రెండో, మూడవ వన్డే మ్యాచ్‌ల కోసం జట్టులో చేరనున్నారు. మరోవైపు రజత్ పటిదార్‌ను ఇరానీ కప్ కోసం రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు కెప్టెన్‌గా నియమించారు. ఈ మ్యాచ్ అక్టోబర్ 1 నుంచి నాగ్‌పూర్‌లో విదర్భతో జరగనుంది. శ్రేయస్ అయ్యర్ రెడ్–బాల్ క్రికెట్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించిన నేపథ్యంలో, రజత్ పటిదార్ ఈ బాధ్యతను స్వీకరించారు.శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో ఇండియా ఏ జట్టు ఆస్ట్రేలియాతో జరిగే సిరీస్‌లో ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి. అతని ఫిట్‌నెస్, శారీరక సామర్థ్యం మెరుగుపడిన తర్వాత, మళ్లీ రెడ్–బాల్ క్రికెట్‌లో అతని రాక ఉంటుంది.

## హరిస్ రవూఫ్, ఫర్హాన్‌పై చర్యలు తీసుకోండి.. ఐసీసీకి బీసీసీఐ ఫిర్యాదు..




ప్రస్తుత ఆసియా కప్‌లో ఇప్పటివరకు భారత్, పాకిస్థాన్ జట్లు రెండు సార్లు తలపడ్డాయి. రెండు మ్యాచ్‌ల్లోనూ టీమిండియానే విజయం సాధించింది. అయితే ఈ మ్యాచ్‌ల్లో ఆట కంటే మైదానంలో జరిగిన డ్రామానే ఎక్కువగా వార్తల్లో నిలుస్తోంది. తొలి మ్యాచ్‌లో షేక్ హ్యాండ్ వివాదం ఉద్రిక్తతలు సృష్టించింది. సెప్టెంబర్ 21న దుబాయ్‌లో భారత్‌తో జరిగిన సూపర్ ఫోర్ మ్యాచ్‌లో పాకిస్తాన్ ఆటగాళ్లు సాహిబ్‌జాదా ఫర్హాన్), హరిస్ రవూఫ్ అవమానకర ప్రవర్తనకు పాల్పడ్డారు. ఈ ఇద్దరు ఆటగాళ్లు హద్దుమీరి ప్రవర్తించడంతో బీసీసీఐ రంగంలోకి దిగింది. మైదానంలోని ఫర్హాన్, హరిస్ ప్రవర్తనపై ఐసీసీకి ఫిర్యాదు చేసింది ఐసీసీ నియమావళి ప్రకారం.. ఈ ఫిర్యాదుకు ఫర్హాన్, హరిస్ లిఖితపూర్వకంగా జవాబివ్వాల్సి ఉంటుంది. వారు ఐసీసీ ఎలైట్ ప్యానెల్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ ముందు విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది. వారు తమ చర్యలను సమర్థించుకోలేకపోతే, నిషేధాన్ని ఎదుర్కోవలసి రావచ్చు. బీసీసీఐ ఫిర్యాదుకు ప్రతిస్పందనగా పీసీబీ కూడా టీమిండియా కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్‌పై ఐసీసీకి ఫిర్యాదు చేసింది %సెప్టెంబర్ 14 మ్యాచ్ తర్వాత సూర్య కుమార్ యాదవ్ చేసిన ప్రకటనను ఉటంకిస్తూ, ఐసీసీకి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఫిర్యాదు చేసింది అయితే, ఐసీసీ రూల్ ప్రకారం ఎవరైనా ఆటగాడు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే.. ఘటన జరిగిన ఏడు రోజుల్లోపు ఫిర్యాదు చేయాలి. కాబట్టి పీసీబీ ఫిర్యాదును ఐసీసీ తిరస్కరించవచ్చు. సూపర్–4 మ్యాచ్‌లో హరిస్ రవూఫ్ బౌండరీ లైన్ దగ్గర ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో 6–0 అంటూ సంజ్ఞలు చేశాడు. ఇక, ఫర్హాన్ హాఫ్ సెంచరీ చేసిన తర్వాత బ్యాట్‌ను ఏకే 47లా పట్టుకుని బులెట్లు కాలుస్తున్నట్టు సెలబ్రేట్ చేసుకున్నాడు.

## యువరాజ్ సింగ్ రికార్డు బ్రేక్ చేసిన అభిషేక్ శర్మ

దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో నిన్న ఆసియా కప్ 2025 సూపర్ ఫోర్ మ్యాచ్‌లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ తన గురువు యువరాజ్ సింగ్‌ను అధిగమించి కొత్త రికార్డ్ సృష్టించాడు. పాకిస్తాన్‌తో జరిగిన గత మ్యాచ్‌లో 74 పరుగులతో చెలరేగిన అభిషేక్, తాజాగా బంగ్లాదేశ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో మరోసారి అర్ధ సెంచరీతో అభిమానులను ఆకట్టుకున్నాడు. ఈ మ్యాచులో అభిషేక్ మొదట్లో కాస్త నెమ్మదిగా ఆడినా, తర్వాత మంచి ఊపును కొనసాగించాడు. తొమ్మిది బంతుల్లో కేవలం తొమ్మిది పరుగులతో ఉన్న అభిషేక్, ఒక్కసారిగా గేర్ మార్చి, కేవలం 25 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. ఎనిమిదో ఓవర్‌లో శుభ్‌మన్ గిల్ ఔటైన తర్వాత, అభిషేక్ తన ఆటతీరును మరింత పెంచి, బంగ్లాదేశ్ బౌలర్లను చీల్చిచెండాడాడు. ఈ అర్ధ




సెంచరీతో అభిషేక్, టీ20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లలో 25 లేదా అంతకంటే తక్కువ బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన భారత ఆటగాళ్ల జాబితాలో యువరాజ్ సింగ్‌ను అధిగమించాడు.

## బ్యాటర్ల వైఫల్యం భారత్–ఎ 194 ఆలౌట్



లఖ్‌నవూ: భారత్–ఎ బ్యాటర్లు ఘోరంగా విఫలమవడంతో.. రెండో అనధికార టెస్ట్‌లో ఆస్ట్రేలియా–ఎ భారీ ఆధిక్యాన్ని నమోదు చేసింది. ఆటకు రెండో రోజైన బుధవారం తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 194 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 420 పరుగులకంటే భారత్ 226 రన్స్ వెనుకబడింది. సాయి సుదర్శన్ (75), నారాయణ్ జగదీశన్ (38) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. టెస్ట్ రేస్‌లో ఉన్న నితీశ్ కుమార్ (1) సింగిల్ డిజిట్‌కే వెనుదిరగ్గా.. ప్రసిద్ధ్ కృష్ణ (16) కంకషన్‌తో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. పేసర్ హెన్రీ థార్న్‌టన్ 4 వికెట్లు తీశాడు. కాగా, రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ 16/3 స్కోరు చేసింది. ఆలివర్ (1)ను మానవ్ అవుట్ చేయగా.. మెక్స్వీనే (11) క్రీజులో ఉన్నాడు. కొంటాస్ (3)ను బ్రార్.. కెల్లీ (0)ని సిరాజ్ పెవిలియన్ చేర్చారు. మొత్తంగా ఆసీస్ 242 రన్స్ ఆధిక్యంలో ఉంది.

## పతకం తెచ్చే సత్తా ఉంటేనే

న్యూఢిల్లీ: వచ్చే ఆసియా క్రీడల (2026)కు కఠినమైన ఎంపిక ప్రక్రియను కేంద్రం ప్రకటించింది. పతకాలు సాధించే సత్తా కలిగిన అథ్లెట్లనే ఎంపికలో పరిగణిస్తామని క్రీడా శాఖ స్పష్టంజేసింది. ఈ క్రమంలో ఆసియా ర్యాంకింగ్స్‌ను ప్రామాణికంగా తీసుకుంటారని పేర్కొంది. అలాగే ప్రభుత్వంపై భారం పడకున్నా..అంటే అథ్లెట్లు సొంత ఖర్చులతో కోచ్‌లు, ఇతర సహాయ సిబ్బందిని తీసుకువెళ్లడానికి కూడా అనుమతించబోమని తెలిపింది. ఈమేరకు ఎంపిక ప్రక్రియకు సంబంధించిన ఐదు పేజీల డాక్యుమెంట్‌ను క్రీడా శాఖ తన వెబ్‌సైట్‌లో బుధవారం అప్‌లోడ్ చేసింది. వ్యక్తిగత క్రీడాంశాల్లో తొలి ఆరు ర్యాంకుల్లో, అలాగే టీమ్ క్రీడాంశాల్లో భారత జట్టు ఎనిమిదో ర్యాంకులోపు ఉంటేనే ఆసియా క్రీడల ఎంపికకు ఆయా క్రీడా సమాఖ్యలు సిఫారసు చేయాల్సి ఉంటుంది. ఆసియా క్రీడలు వచ్చే ఏడాది సెప్టెంబరు 19 నుంచి అక్టోబరు నాలుగు వరకు జపాన్‌లోని నగోయాలో జరగనున్నాయి. కామన్వెల్త్ క్రీడలు (ఆగస్టు 2026), సహా ఆసియా స్థాయిలో జరిగే ఇతర క్రీడలకూ ఇదే విధానం వర్తిస్తుందని వెల్లడించింది.

## అదరగొట్టిన వైభవ్ అభిగ్యాన్

బ్రిస్బేన్: యువ బ్యాటర్లు అభిగ్యాన్ కుందు (64 బంతుల్లో 71), వైభవ్ సూర్యవంశీ (68 బంతుల్లో 70), విహాన్ మల్హోత్రా (74 బంతుల్లో 70) చెలరేగడంతో.. ఆస్ట్రేలియా అండర్–19 జట్టుతో మూడు వన్డేల సిరీస్‌లో భారత అండర్–19 జట్టు 2–0తో తిరుగులేని స్థితిలో నిలిచింది. బుధవారం జరిగిన రెండో వన్డేలో భారత్ 51 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత భారత్ 49.4 ఓవర్లలో 300 పరుగులకు ఆలౌటైంది. విల్ బైరోమ్ మూడు, యశ్ దేశ్‌ముఖ్ రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఆసీస్ 47.2 ఓవర్లలో 249 పరుగులకే కుప్పకూలింది. జేడెన్ డ్రేపర్ (107) సెంచరీ వృథా అయింది. ఆయుష్ మాత్రే మూడు, కనిష్క చౌహాన్ రెండు వికెట్లు పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో ఆరు సిక్స్‌లు బాదిన వైభవ్



మొత్తం 41 సిక్సర్లతో.. యూత్ వన్డేల్లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన ఉన్ముక్త్ చాంద్ (38 సిక్స్‌లు) రికార్డును అధిగమించాడు.

## ఫైనల్లో భారత్ ఆసియా కప్‌లో నేడు

దుబాయ్: వరుస విజయాలతో జోరు మీదున్న భారత్.. ఆసియా కప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. అభిషేక్ శర్మ (37 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 75) ధనాధన్ అర్ధ శతకంతోపాటు బౌలర్లు రాణించడంతో.. బుధవారం జరిగిన సూపర్–4 మ్యాచ్‌లో టీమిండియా 41 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. తొలుత భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 168/6 స్కోరు చేసింది. హార్దిక్ పాండ్యా (38), శుభ్‌మన్ గిల్ (29) రాణించారు. రిషద్ హుస్సేన్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఛేదనలో బంగ్లా 19.3 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. సైఫ్ హసన్ (69), పర్వేజ్ హొస్సేన్ ఇమాన్ (21) మినహా మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. కుల్దీప్ మూడు.. బుమ్రా, వరుణ్ చక్రవర్తి చెరో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. అభిషేక్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. సూపర్–4లో నాలుగు పాయింట్లతో టీమిండియా తొలి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకోగా.. శ్రీలంక టోర్నీ నుంచి నిష్క్రమించింది. గురువారం పాకిస్థాన్, బంగ్లాదేశ్ మధ్య జరిగే మ్యాచ్‌తో రెండో బెర్త్ ఎవరికి దక్కుతుందో తేలుతుంది. లిట్టన్ దాస్ వెన్నునొప్పితో బాధపడుతుండడంతో




జాకెర్ అలీ బంగ్లా తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు. సైఫ్ ఒంటరి పోరాటం చేసినా.. టీమిండియా బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టడంతో బంగ్లా ఏదశలోనూ మ్యాచ్‌లోకి రాలేకపోయింది. రెండో ఓవర్‌లో ఓపెనర్ తన్జిద్ హసన్ (1)ను అవుట్ చేసిన బుమ్రా.. ఆరంభంలోనే బంగ్లాను దెబ్బకొట్టాడు. దీంతో సైఫ్, పర్వేజ్ ఆచితూచి ఆడడంతో స్కోరు బోర్డు మందకొడిగా కదిలింది. అయితే, నాలుగో ఓవర్‌లో వరుణ్ బౌలింగ్‌లో రెండు వరుస బౌండ్రీలతో దూకుడు పెంచిన పర్వేజ్.. ఆ తర్వాతి ఓవర్‌లో బుమ్రా బౌలింగ్‌లో సిక్స్ బాదాడు. దీంతో ఆరు ఓవర్లకు బంగ్లా 44/1తో నిలిచింది. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు కుల్దీప్, అక్షర్ పరుగులను కట్టడి చేస్తూ బంగ్లా బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. ధాటిగా ఆడే ప్రయత్నం చేస్తున్న పర్వేజ్‌ను అవుట్ చేసిన కుల్దీప్.. రెండో వికెట్‌కు 42 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీశాడు. మరోవైపు సైఫ్ వీలు చిక్కినప్పుడల్లా షాట్లు ఆడుతూ స్కోరు బోర్డును నడిపించాడు. కాగా, 10వ ఓవర్‌లో తన బౌలింగ్‌లో సిక్స్ బాదిన హ్రిదయ్ (7)ను అక్షర్ అదే ఓవర్‌లో క్యాచౌట్ చేశాడు. ఆ తర్వాత షమీమ్ (0)ను వరుణ్ బౌల్డ్ చేయడంతో.. బంగ్లా 74/4తో ఇబ్బందుల్లో పడినట్టు కనిపించింది. జాకెర్ అలీ (4)ని సూర్య రనౌట్ చేశాడు. మరోవైపు అక్షర్ వేసిన 14వ ఓవర్‌లో రెండు సిక్స్‌లతో అర్ధ శతకం పూర్తి చేసుకొన్న సైఫ్.. జట్టు స్కోరును సెంచరీ దాటించాడు. బంగ్లా విజయానికి చివరి 5 ఓవర్లలో 61 పరుగులు కావల్సి ఉండగా.. సైఫుద్దీన్ (4)ను వరుణ్ వెనక్కిపంపాడు. 17వ ఓవర్‌లో రిషద్ (2), తన్జిమ్ హసన్ (0)ను కుల్దీప్ వరుస బంతుల్లో పెవిలియన్ చేర్చగా.. సైఫ్‌ను బుమ్రా అవుట్ చేయడంతో బంగ్లా పోరాటం ముగిసింది. డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ అదిరే ఆరంభాన్నిచ్చినా.. మిగతా బ్యాటర్ల వైఫల్యంతో భారత్ ఓ మాదిరి స్కోరుకే పరిమితమమైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా పవర్‌ప్లే తొలి మూడు ఓవర్లలో 17 పరుగులే చేసినా.. ఆ తర్వాత ఓపెనర్లు అభిషేక్, గిల్ బ్యాట్లు ఝుళిపించారు. నాలుగో ఓవర్‌లో నసుమ్ అహ్మద్ బౌలింగ్‌లో గిల్ 4, 6తో జోరు చూపగా.. అభిషేక్ సిక్స్‌తో మొత్తం 21 పరుగులు లభించాయి. ఇక్కడి నుంచి టాప్ గేర్‌లో సాగిన శర్మ రెండు సిక్స్‌లు, నాలుగు ఫోర్లు బాదడంతో.. ఆరు ఓవర్లు ముగిసే సరికి భారత్ 72/0తో భారీ స్కోరు చేసేలా కనిపించింది. కానీ, మధ్య ఓవర్లలో స్పిన్నర్ రిషద్.. గిల్‌తోపాటు వన్‌డౌన్ బ్యాటర్ శివం దూబే (2)ను అవుట్ చేసి టీమిండియా జోరుకు బ్రేకులు వేశాడు. దీంతో తొలి వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు సింగిల్‌తో అభిషేక్ ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. ఈ క్రమంలో కొంతసేపు స్తబ్దుగా ఉన్న అభిషేక్.. 11వ ఓవర్‌లో 6,4తో మరోసారి బ్యాట్‌కు పని చెప్పడంతో జట్టు స్కోరు సెంచరీ మార్క్ దాటింది.

# బిజినెస్



## వరుసగా నాలుగో రోజూ నష్టాలే.. ఈ రోజు టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..




విదేశీ సంస్థాగత మదుపర్లు అమ్మకాలకు దిగుతుండడంతో దేశీయ సూచీలు వరుసగా నాలుగో రోజు కూడా నేల చూపులు చూస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు హెచ్1బీ వీసాల విషయంలో తీసుకున్న నిర్ణయం, డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి బలహీనపడడం, ఇండియన్ ఈక్విటీ మార్కెట్లు ఓవర్ వెయిట్ జోన్‌లో ఉన్నట్టు హెచ్ఎస్‌బీసీ ప్రకటించడం దేశీయ సూచీలకు నెగిటివ్‌గా మారాయి. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ నష్టాలను ఎదుర్కొంటున్నాయి బుధవారం ముగింపు (81, 715)తో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు 150 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఒక దశలో లాభాల్లోకి వచ్చింది. ఆ తర్వాత వెంటనే నష్టాల్లోకి జారుకుంది. ప్రస్తుతం ఉదయం 10:40 గంటల సమయంలో సెన్సెక్స్ 185 పాయింట్ల నష్టంతో 81, 529 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 51 పాయింట్ల నష్టంతో 25, 004 వద్ద కొనసాగుతోంది %సెన్సెక్స్‌లో ఆయిల్ ఇండియా, కేపీఐటీ టెక్, కేఫిన్ టెక్, వేదాంత, టిటాగర్ రైల్ షేర్లు లాభాల్లో ఉన్నాయి . టాటా మోటార్స్, ఆస్ట్రాల్ లిమిటెడ్, ఇన్ఫో ఎడ్జ్, పేటీఎమ్, ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 53 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 33 పాయింట్ల నష్టంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 88.64గా ఉంది.

## బంగారం ధరలో స్వల్ప తగ్గుదల.. ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..




బంగారం ధర రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (సెప్టెంబర్ 25న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 15, 360కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 05, 740కి చేరింది ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 15, 510కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 05, 890కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 15, 360కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1, 05, 740కి చేరింది . వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే కేజీకి వంద రూపాయల మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం

## ఎఫ్ఎంసీజీకి జీఎస్‌టీ తంటా

న్యూఢిల్లీ: జీఎసటీ రేట్ల తగ్గింపు అమలు చేయడం ఎఫ్ఎంసీజీ కంపెనీలకు పెద్ద తలనొప్పిగా మారింది. చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో రూ.10, రూ.5, రూ.2 ఎంఆర్‌పీకి అమ్మే వస్తువుల ధర ల్ని, జీఎసటీ 2.0 సంస్కరణలతో పావ లా నుంచి 55 పైసల వరకు తగ్గించి అమ్మాల్సి వస్తోంది. అయితే తగ్గిన ధరలకు సరిపడా చిల్లర లేక అటు కొనుగోలుదారులు, ఇటు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పేద, మధ్య తరగతి వర్గాలు, గ్రామీణ ప్రజల నుంచి ఈ సమస్య ఎక్కువగా ఉందని రిటైల్ వ్యాపారులు చెబుతున్నారు.సాధారణంగా ఎఫ్ఎంసీజీ కంపెనీలు రెండు నెలల వినియోగానికి సరిపడా వస్తువులను మార్కెట్‌లో విడుదల చేస్తుంటాయి. జీఎసటీ రేట్ల తగ్గింపుపై ఈ నెల మొదటి వారంలో గానీ కంపెనీలకు స్పష్టత రాలేదు. నవంబరు వరకు మార్కెట్‌లో విడుదల చేసే వస్తువుల ఎంఆర్‌పీ ధరలను కంపెనీలు ఇప్పటికే ముద్రించేశాయి. ఇపుడు జీఎసటీ తగ్గింపునకు అనుగుణంగా రేట్లు తగ్గించినా, చిల్లర సమస్య ఎదురవుతోంది. ఈ కారణంగా ఆయా ప్యాకెట్లలోని వస్తువుల పరిమాణం పెంచి, డిసెంబరు నుంచి పాత ఎంఆర్‌పీ ధరలకే మార్కెట్‌లో విడుదల చేయాలని




కంపెనీలు యోచిస్తున్నాయి.ఇది తాత్కాలిక సమస్య. ప్యాకెట్‌లోని వస్తువుల పరిమాణం పెంచడం ద్వారా నెలన్నర నుంచి రెండు నెలల్లో ఈ సమస్యను అధిగమిస్తాం' అని పార్లే ప్రొడక్ట్స్ వైస్ ప్రెసిడెంట్ మయాంక్ షా చెప్పారు. నువామా ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ సీనియర్ అధికారి అభనీశ్ రాయ్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు.

## తగ్గిన సి మంట

తెలుగు రాష్ట్రాలతో సహా దేశ వ్యాప్తంగా సిమెంట్ ధరలు తగ్గాయి. రిటైల్ మార్కెట్‌లో సిమెంట్ 50 కిలోల బస్తా ధర రెండు తెలుగు రాష్ట్రాల్లో రూ.30 వరకు తగ్గింది. ఈ నెల 21 వరకు బ్రాండును బట్టి ధర రూ.290 నుంచి రూ.370 వరకు ఉండేది. జీఎసటీ భారం 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గడంతో ఇప్పుడది రూ.260 నుంచి రూ.330 వరకు పలుకుతోంది. దీంతో గత నెల రోజుల నుంచి వినియోగదారులు కొనుగోళ్లకు ముందుకు వస్తున్నట్టు రిటైల్ డీలర్లు చెబుతున్నారు.పెరగనున్న డిమాండ్: నిన్న మొన్నటి వరకు దేశ వ్యాప్తంగా సిమెంట్ అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతి నెల సగటున 23 నుంచి 25 లక్షల టన్నుల సిమెంట్ అమ్ముడయ్యేది. వర్షాల



దెబ్బకు అది గత నెల 21 లక్షల టన్నులకు పడిపోయినట్టు పరిశ్రమ వర్గాలు చెప్పాయి. పండుగల సీజన్, జీఎసటీ లాభం తోడవడంతో అమ్మకాలు మళ్లీ పుంజుకుంటాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో ప్రస్తుతం 55 నుంచి 60 శాతం వరకు ఉన్న ఉత్పత్తి సామర్థ్య వినియోగం జనవరి నాటికి 60 శాతం మించే అవకాశం ఉందని ఒక కంపెనీ డైరెక్టర్ చెప్పారు.

## ఫోన్‌పే రూ 12000 కోట్ల ఐపీఓ




న్యూఢిల్లీ: ప్రపంచ రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ గ్రూప్ అనుబంధ సంస్థ ఫోన్‌పే కూడా తొలి పబ్లిక్ ఆఫరింగ్‌కు (ఐపీఓ) రాబోతోంది. ఇందుకు అనుమతి కోరుతూ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓ వివరాలను గోప్యంగా ఉంచేందుకు ఈ సంస్థ కాన్ఫిడెన్షియల్ ప్రీ-ఫైలింగ్ మార్గాన్ని ఎంచుకుంది. ఐపీఓ ద్వారా ఫోన్‌పే రూ.12,000 కోట్ల వరకు నిధులు సమీకరించాలనుకుంటున్నదని, ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ‌ఎస్) పద్ధతిన జరగనుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఓఎఫ‌ఎస్ ద్వారా కంపెనీ వాటాదారులైన వాల్‌మార్ట్, టైగర్ గ్లోబల్, మైక్రోసాఫ్ట్ మొత్తంగా 10 శాతం వరకు వాటాను విక్రయించనున్నాయని వారన్నారు. 2016 ఆగస్టులో ప్రారంభమైన ఫోన్‌పే డిజిటల్ చెల్లింపులతోపాటు బీమా, రుణాలు, వెల్త్ సేవలనూ అందిస్తోంది. ప్రస్తుతం మార్కెట్ వాటాపరంగా ఫోన్‌పే దేశంలో అతిపెద్ద డిజిటల్ చెల్లింపుల సేవల కంపెనీగా ఉంది.

## బజాజ్ ఎలక్ట్రికల్ చేతికి మర్ఫీ రిచర్డ్స బ్రాండ్ హక్కులు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఎలక్ట్రికల్ అప్లయెన్స్ బ్రాండ్ మర్ఫీ రిచర్డ్స్ మేధో సంపత్తి హక్కులను కొనుగోలు చేస్తున్నట్లు బజాజ్ ఎలక్ట్రికల్స్ బుధవారం ప్రకటించింది. ఐర్లాండ్‌కు చెందిన గ్లెన్ డింప్లెక్స్ గ్రూప్‌లో భాగమైన గ్లెన్ ఎలక్ట్రిక్ నుంచి ఈ హక్కులను దక్కించుకోనున్నట్లు తెలిపింది. ఈ డీల్‌లో భాగంగా బజాజ్ ఎలక్ట్రికల్స్‌కు భారత్, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, మాల్దీవులు, శ్రీలంక మార్కెట్లలో మర్ఫీ రిచర్డ్స్ బ్రాండ్ హక్కులు కూడా లభించనున్నాయి. ఈ ఒప్పందం విలువ రూ.146 కోట్లు. బజాజ్ ఎలక్ట్రికల్స్ గత రెండు దశాబ్దాలుగా మర్ఫీ రిచర్డ్స్ బ్రాండ్‌తో లైసెన్సు ఒప్పందం కలిగి ఉంది. తద్వారా సంస్థ మర్ఫీ రిచర్డ్స్ బ్రాండ్ మిక్సర్లు, ఓవెన్, టోస్టర్ గ్రిల్స్, కాఫీ మేకర్స్, ఎయిర్ ఫ్రేయర్స్, ఐరన్ బాక్సులు, హాట్ ఎయిర్ బ్రష్, హెయిర్ స్ట్రేయిటెనర్స్, హెయిర్ డ్రయర్స్‌ను భారత్‌లో విక్రయిస్తోంది. మేధో సంపత్తి హక్కుల కొనుగోలుతో బజాజ్ ఎలక్ట్రికల్ భారత్ సహా నిర్దేశిత మార్కెట్లలో మర్ఫీ రిచర్డ్స్ బ్రాండ్ హక్కులపై పూర్తి యాజమాన్యాన్ని కలిగి ఉండనుంది.

## భారత ఆర్థిక వ్యవస్థలో పెరిగిన వినియోగదారుల విశ్వాసం

భారత్ ఆర్థిక స్థిరత్వం, వినియోగదారుల విశ్వాసాన్ని మరోసారి ప్రతిబింబిస్తూ గ్లోబల్ వేదికపై తన ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంది. ప్రపంచవ్యాప్తంగా వినియోగదారుల మనోభావాలను అంచనా వేసే ప్రైమరీ కన్స్యూమర్ సెంటిమెంట్ ఇండెక్స్ (%ూజూ×%) ప్రకారం, సెప్టెంబర్ నెలకు భారత్ రెండో స్థానంలో నిలిచింది. గత నెలలో 57.6గా ఉన్న జాతీయ ఇండెక్స్ స్కోర్ ఈ నెలలో 57.0కి స్వల్పంగా తగ్గినప్పటికీ, భారతదేశం తన వినియోగదారుల విశ్వాసంలో స్థిరత్వాన్ని కొనసాగిస్తోంది.ఇది భారత్‌లో నమ్మకమైన ఆర్థిక ప్రగతిని, వినియోగదారుల భద్రతా భావనను ప్రతిబింబిస్తోంది. దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఆదాయం, వ్యయ సామర్థ్యం, భవిష్యత్ ఆర్థిక స్థిరత్వంపై ప్రజలలో నెలకొన్న విశ్వాసం ఇవన్నీ ఈ పురస్కార స్థాయిలో ప్రతిఫలించాయి. గ్లోబల్ అస్థిరత నేపథ్యంలో భారత్ చూపిస్తున్న స్థిరత్వం, అభివృద్ధి పట్ల ఉన్న పట్టుదల, అంతర్జాతీయంగా మరింత ఆదరణ పొందుతున్నాయి.ఆగస్టులో కనిపించిన ఆందోళనలు, వినియోగదారుల విశ్వాసంలో క్షీణత తర్వాత, సెప్టెంబర్‌లో భారతదేశంలో వినియోగదారుల మనోభావం స్థిరపడిందని ఇప్సోస్ ఇండియా %జజుూ% సురేష్ రామలింగం అన్నారు. ప్రపంచ సమస్యలు భారతీయ వినియోగదారులపై పెద్దగా ప్రభావం చూపనప్పటికీ, దేశీయ పరిణామాలు విశ్వాసాన్ని పునరుద్ధరించడంలో కీలక పాత్ర పోషించాయన్నారు. సెప్టెంబర్ 22 నుంచి అమలులోకి వచ్చిన %+ూ% 2.0 సంస్కరణలు వినియోగదారులకు ఊరటనిచ్చే అంశంగా నిలిచాయి. %+ూ% రేట్లను 5%, 18% స్టాండర్డ్ శ్లాబ్‌లుగా సరళీకరించడం ద్వారా, జీవన వ్యయ ఒత్తిడిని ఎదుర్కొంటున్న వినియోగదారులకు ఊరట కల్పించింది

## 82000 దిగువకు సెన్సెక్స్

ముంబై: ఈక్విటీ సూచీలు వరుసగా నాలుగో రోజూ నష్టాల్లో పయనించాయి. సెన్సెక్స్ 82,000 పాయింట్లు, నిఫ్టీ 25,100 పాయింట్ల దిగువకు జారాయి. బ్యాంకింగ్, ఆటో, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లలో మదుపరులు లాభాలు స్వీకరించడం ఇందుకు కారణం. విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ, ఐటీ షేర్లలో కొనసాగిన అమ్మకాలు కూడా వరుస నష్టాలకు మరో కారణం. బుధవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 386.47 పాయింట్లు కోల్పోయి 81,715.63 వద్దకు జారుకుంది. నిఫ్టీ 112.60 పాయింట్ల నష్టంతో 25,056.90 వద్ద ముగిసింది. బీఎసఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ.3 లక్షల కోట్లు తగ్గి రూ.460.56 లక్షల కోట్లకు పడిపోయింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006